

రామవరం భూములు ఫ్రీహోల్డ్‌పై విచారణ

- భీమిలి ఆర్డీవోకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం రామవరం గ్రామంలోని సర్వే నంబర్ 164-3లో బలహీన వర్గాలకు చెందిన వారికి ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన 1.53 ఎకరాలకు ఫ్రీ హోల్డ్ అనుమతులు జారీపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. విచారణాధికారిగా భీమిలి ఆర్డీవోను నియమించారు. 'ప్రభుత్వ భూమికి ఎసరు' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సర్వే సర్వత్రా...

లోకల్ నుంచి జాతీయ స్థాయి వరకూ 45 సంస్థల ఎగ్జిట్ పోల్స్ వెల్లడి

- కూటమి విజయం సాధిస్తుందన్న 37 సంస్థలు
- వైసీపీ నెగ్గుతుందన్న 8 సంస్థలు
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 12 స్థానాల వరకూ కూటమి కైవసం చేసుకుంటుందని పలు సంస్థల అంచనా
- విశాఖపట్నం, అనకాపల్లి ఎంపీ సీట్లు కూటమి ఖాతాలోనే...
- మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు ఓడిపోబోతున్నారన్న 'ఆరా'
- విశాఖ 'నార్త్'లో టైట్ ఫైట్

ఎగ్జిట్ పోల్స్‌పై ఆసక్తి

సాయంత్రం 6.30 గంటల నుంచి టీవీలకు అతుక్కుపోయిన జనం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అందరిలోను ఒకటే ఉత్కంఠ. రాష్ట్రంలో ఏ పార్టీ గెలుస్తుంది?, జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి?, ఎవరు గెలుస్తారు?, ఎవరు ఓడిపోతారు?...ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఈ ప్రశ్నలకు నాలుగో తేదీన సమాధానం లభించనున్నది. అయితే ఈలోగా సర్వే సంస్థలు కొంత స్పష్టత ఇచ్చాయి. దేశవ్యాప్తంగా చివరివిడత పోలింగ్ శనివారం ముగియడంతో సాయంత్రం 6.30 గంటల తరువాత వరుసగా ఒక దాని తరువాత మరొకటి ఎగ్జిట్ పోల్ వివరాలు వెల్లడించాయి. దాంతో జిల్లా వాసులు టీవీలకు అతుక్కుపోయి ఆసక్తిగా వీక్షించారు. దాదాపు 45 సంస్థలు తాము చేపట్టిన సర్వే ఫలితాలు ప్రకటించాయి. వాటిలో 37 రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి, కేంద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వస్తాయని తెలిపాయి. కేవలం ఎనిమిది సంస్థలు మాత్రమే వైసీపీకి ఆధిక్యం లభిస్తుందని వెల్లడించాయి.



నగరంలోని ఓ షోరూమ్‌లో ఎగ్జిట్ పోల్స్‌ను వీక్షిస్తున్న దృశ్యం

కొన్ని నెలల క్రితం పొరుగు రాష్ట్రమైన తెలంగాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోను ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఇలాగే వచ్చాయి. కేసీఆర్ సారథ్యం వహిస్తున్న అధికార పార్టీ బీఆర్ఎస్ ఓడిపోతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సర్వే సంస్థలు తెలిపాయి. దీనిని బీఆర్ఎస్ అంగీకరించలేదు. అవన్నీ తప్పుడు సర్వేలని కేటీఆర్ కొట్టి పడేశారు. కానీ సర్వే సంస్థలు చెప్పిందే నిజమైంది.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోను సర్వే సంస్థలు ఏకపక్షంగా కూటమే అధికారంలోకి వస్తుందని తేల్చాయి. మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో కూటమికి 144 సీట్లు వస్తాయని పయనీర్ సంస్థ వెల్లడించింది. కూటమి అధికారంలోకి వస్తుందని చెప్పిన సంస్థలు వైసీపీకి 60 సీట్లు వస్తాయని తేల్చాయి. ఇతర పార్టీలకు ఒకటి కంటే ఎక్కువ సీట్లు రావని పేర్కొన్నాయి. కేకే సర్వే సంస్థ అయితే కూటమికి 161 స్థానాలు వస్తాయని, వైసీపీకి కేవలం 14 సీట్లు మాత్రమే వస్తాయని వెల్లడించింది. రైజ్ సంస్థ కూటమికి 113-122, వైసీపీకి 48-60, చాణక్య స్ట్రాటజీస్ కూటమికి 114-125, వైసీపీకి 39-49, పీపుల్స్ పల్స్ సంస్థ కూటమికి 111-135, వైసీపీకి 45-60, ఆరా సంస్థ కూటమికి 71-81, వైసీపీకి 94-104 వస్తాయని ... మిగతా 6వ పేజీలో

ఘనంగా హనుమజ్జయంతి


పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో గల యోగ సిద్ధాంజనేయ ఆలయంలో తన్మయ మారుతిగా అలంకరణ

హనుమాన్ జయంతిని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు వచ్చి స్వామి వారికి పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

అర్ధరాత్రి గాలుల బీభత్సం


వుడా పార్కు వద్ద శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి కూలిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వాతావరణ అనిశ్చితితో శుక్రవారం అర్ధరాత్రి తరువాత పెనుగాలులు వీయడంతో నగరంలో పలుచోట్ల చెట్లు, కొమ్మలు విరిగిపోయాయి. సుమారు గంటపాటు పిడుగులతో గట్టి వర్షం కురిసింది. ఇక, శనివారం పగటిపూట పెద్దగా ఎండ లేకపోయినా ఉక్కపోత వాతావరణం కొనసాగింది. రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఎండలు, ఉక్కపోత కొనసాగుతాయని, అక్కడక్కడా వడగాడ్పులు వీస్తాయని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

అన్నవరంలో గతంలోనే భూసమీకరణ

- రైతులకు అన్యాయం జరిగిందని భావిస్తే కలెక్టర్ కార్యాలయానికి వచ్చి చెప్పుకోవచ్చు
- డి.పట్టా భూములకు 'ఫ్రీ హోల్డ్' అనుమతుల జారీలో ఎటువంటి ఒత్తిళ్లు లేవు
- కలెక్టర్ ఎ.మల్లికార్జున

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): భీమిలి మండలం అన్నవరం గ్రామంలో గతంలోనే వీఎంఆర్‌డీఏ భూ సమీకరణ చేసిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అన్నవరం గ్రామంలో వివాదంపై స్పందించారు. తమకు అన్యాయం జరిగిందని మీడియా ముందుకు వచ్చిన రైతులు కలెక్టరేట్‌లో తనను కలిసి అన్ని వివరాలు చెప్పుకోవచ్చునన్నారు. భూసమీకరణ సమయంలో ఇద్దరు రైతులు మాత్రమే కోర్టుకు వెళ్లారని, అయితే సదరు రైతులకు ఆ భూములపై ... మిగతా 6వ పేజీలో

భూ చోళ్లు!

అంతా కలిసి పేదల నోట్లో మట్టి కొట్టారు

- డి.పట్టా భూములు చేజిక్కించుకునేందుకు ఏడాది నుంచి వ్యూహం
- తొలుత విశాఖ శివారుల్లో గల నాలుగు మండలాల్లో 2,000 ఎకరాల వరకూ ఉన్నట్టు గుర్తింపు
- ఆ తరువాత రైతులకు ఎకరాకు రూ.5 లక్షల అడ్వాన్స్ ఇచ్చి ఒప్పందాలు
- ఈ తతంగం పూర్తయిన తరువాతే 'ఫ్రీ హోల్డ్' జీవో
- ఆనందపురం రామవరంలో 20 నుంచి 25 ఎకరాలు
- ప్రభుత్వ పెద్దల బినామీలకు రిజిస్ట్రేషన్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర శివారు, భోగాపురం ఎయిర్‌పోర్టు పరిసరాల్లో భూములు కొనుగోలు విషయంలో అత్యున్నత అధికారి తొలి నుంచి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. విశాఖ చుట్టుపక్కల డి.పట్టా భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో సమాచారం సేకరించిన సదరు కీలక అధికారి తన మనుషులకు గత ఏడాది దసరా పండుగ నుంచే రంగంలోకి దింపారు. ఈ నేపథ్యంలో కీలక అధికారి బినామీ త్రిలోక్ నగర శివారుల్లోని రామవరం, గండిగుండం, మామిడిలోవ మరికొన్ని గ్రామాల్లో రైతులను కలుసుకుని బేరాలు కుదుర్చుకున్నారు. స్థానిక అధికారులు, వైసీపీ నేతల సాయంతో ఒప్పందాలు చేసుకున్నారు.

జిల్లాలోని గ్రామీణ మండలాల్లో నాలుగేళ్ల క్రితం జగనన్న కాలనీలకు భారీగా పట్టా భూములను సమీకరించారు. ఇంకా జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ల కోసం మరికొంత సేకరించగా నాలుగు మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాలు మాత్రమే రైతుల వద్ద డి.పట్టా భూమి ఉందని అంచనాకు వచ్చారు.

రైతుల వద్ద ఉన్న భూముల వివరాలను జిల్లా యంత్రాంగం ద్వారా కీలక ఉన్నతాధికారి తీసుకుని తన బినామీ త్రిలోక్‌ను రంగంలోకి దింపారు. ఆయన ఆనందపురం మండలం గండిగుండం, రామవరం, మామిడిలోవ, గిడిజాల, బాకూరిపాలెం, శొంఠ్యాం గ్రామాల్లో రైతులను కలిసి ఎకరాకు రూ.ఐదు లక్షలు ఇచ్చి ఒప్పందాలు చేసుకున్నారు.

ప్రభుత్వ పెద్దలు డి.పట్టా భూములు కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్న తరువాత ప్రభుత్వం గత ఏడాది అక్టోబరు 27న సెక్షన్ 35/2023 పేరిట గజిట్ విడుదల చేసింది. ఆ తరువాత సుమారు రెండు నెలలకు అంటే గత డిసెంబరు 19న జీవో 596 జారీచేసింది. దీని ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన డీపట్టా భూములపై సంబంధిత రైతులకు సర్వ హక్కులు కల్పించేలా ఫ్రీ హోల్డ్ అనుమతులు ఇచ్చే అధికారం సంబంధిత జిల్లా కలెక్టర్లకు కల్పించింది. ఆ జీవో మేరకు జిల్లాలో డీపట్టా భూములు రైతుల వద్దే ఉన్నాయా?, లేవా?...అనేది వీఆర్వోలు సర్వే చేసి తహసీల్దార్లకు నివేదికలు అందజేస్తారు.

ప్రభుత్వ పెద్దలు ఒప్పందాలు కుదుర్చుకున్న భూములకు సంబంధించి ఆనందపురం మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి వెళ్లిన ప్రతిపాదనలకు కలెక్టర్ నేతృత్వంలో కమిటీ ఆమోదం తెలిపిన తరువాత ఫ్రీ హోల్డ్ అనుమతులు వచ్చాయి. విచిత్రమేమిటంటే...గత ఏడాది అక్టోబరు 27న ప్రభుత్వం గజిట్ జారీచేసిన నెల రోజుల వ్యవధిలోనే అంటే నవంబరు 27న పలు గ్రామాల్లో డీపట్టా భూములను ఫ్రీ హోల్డ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సాధారణంగా భూముల వ్యవహారంలో నెలలు, సంవత్సరాల అధికారుల చుట్టూ తిరిగితే తప్ప అనుమతి దొరకదు. అటువంటిది కేవలం నెల రోజుల్లోనే క్షేత్ర స్థాయిలో సర్వే చేసి తహసీల్దారు..అక్కడ నుంచి ఆర్డీవో, అక్కడ నుంచి జేసీ...చివరిగా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశాయి. ఈ విధంగా కొలవానిపాలెం, రామవరం, చందక, పెకూరు, గొట్టిపల్లి, బాకూరుపాలెం, గిడిజాల, శొంఠ్యాం, గండిగుండం, మామిడిలోవ గ్రామాల్లో భారీఎత్తున డీ పట్టా భూములను ఫ్రీహోల్డ్ చేశారు. ఈ ప్రక్రియ జరిగిన సుమారు 20 రోజుల తరువాత డిసెంబరు 19న జీవో నంబరు 596 వచ్చింది. అప్పటికే పలు గ్రామాల్లో రైతులతో ఒప్పందాలు కుదుర్చుకున్న త్రిలోక్ అండ్ గ్యాంగ్ నెమ్మదిగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. రామవరంలో గత ఏడాది కుదుర్చుకున్న ఒప్పందాలు మేరకు ఇప్పటివరకూ సుమారు 20 నుంచి 25 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. మిగిలిన భూములకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని భావించారు. అయితే గడచిన వారం, పది రోజుల నుంచి భూముల వివాదం బయటకు రావడంతో త్రిలోక్ బ్యాచ్ పొరుగునున్న భోగాపురం మండలంపై దృష్టిసారించారన్న ఆరోపణలు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం భీమిలి మండలం అన్నవరం గ్రామంలో డీపట్టా భూముల్లో ఫెన్సింగ్ వేసే ప్రక్రియ వెనుక త్రిలోక్ హస్తం ఉందనే ఆరోపణలు వస్తున్నాయి.


గత ఏడాది నవంబరులో ఫ్రీహోల్డ్ చేసిన రామవరం భూములు

రాత్రి 9 తరువాతే...

అధికారికంగా ఫలితాల వెల్లడి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున
- ఏయూలోని 21 హాళ్లలో కౌంటింగ్
- ఏర్పాట్లు పూర్తి
- పార్లమెంటుకు 104, అసెంబ్లీ సెగ్మెంట్లకు 98, పోస్టల్ బ్యాలెట్లకు 51 టేబుళ్లు
- హాలు నుంచి ఒకసారి ఏజెంట్ బయటకు వెళితే తిరిగి అనుమతించం
- ఏజెంట్లు సెల్‌ఫోన్లు తీసుకురావద్దు
- ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా అనుమతించేది లేదని వెల్లడి
- ఆరో తేదీ వరకూ ఎన్నికల కోడ్
- ప్రతి ఒక్కరూ పాటించాలి
- రెడ్ జోన్‌గా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం: సీపీ రవిశంకర్ అయ్యన్నార్
- సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఈనెల నాలుగో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమవుతుందని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు ఎ.మల్లికార్జున తెలిపారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు త్వరితగతిన పూర్తయినా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు కొంత సమయం పడుతుందన్నారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తయిన తరువాత ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని అధికారికంగా ప్రకటిస్తామన్నారు. అందువల్ల నాలుగో తేదీ రాత్రి తొమ్మిది గంటల తరువాతే ఫలితాలు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. తొలి ఫలితం విశాఖ పశ్చిమ నుంచి రావచ్చునని, చివరగా భీమిలి ఫలితం తేలనున్నదన్నారు. అసెంబ్లీ స్థానాలతో పోల్చితే పార్లమెంటు నియోజకవర్గ ఫలితం రావడం కొంత ఆలస్యమవుతుందన్నారు. ఏయూలోని 21 హాళ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

గాజువాక, పెందుర్తి సెగ్మెంట్‌లకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్లు నాలుగో తేదీ ఉదయం బందోబస్తు మధ్య ఏయూలో కౌంటింగ్ కేంద్రాలకు తీసుకువస్తామన్నారు. పార్లమెంటుకు 104, అసెంబ్లీ సెగ్మెంట్లకు 98, పోస్టల్ బ్యాలెట్లకు 51 టేబుళ్లు ఏర్పాటుచేశామని వెల్లడించారు. ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళి మేరకు రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు వారి తరఫున ఏజెంట్లు నడుచుకోవాలని కోరారు. నాలుగో తేదీ ఉదయం ఆరు గంటలకల్లా ఏజెంట్లు కౌంటింగ్ హాళ్ల వద్దకు రావాలన్నారు. ఒకసారి కౌంటింగ్ హాలులోనికి వెళ్లే ఏజెంట్లు ప్రక్రియ పూర్తయ్యేంత వరకు బయటకు రాకూడదని, ఒకవేళ వస్తే తిరిగి లోపలకు వచ్చేందుకు అనుమతి ఉండదన్నారు. అధికారులు జారీచేసిన గుర్తింపు కార్డులు తనిఖీ చేసిన తరువాతే లోపలకు అనుమతిస్తామన్నారు. సాధారణ వాచీలు తప్ప డిజిటల్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించేది ... మిగతా 6వ పేజీలో


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో సీపీ రవిశంకర్ ఉన్నారు.

వీడియోకాల్ చేసి.. రూ.30 లక్షలు కొట్టేశారు

మోసపోయిన రిటైర్డ్ ఉద్యోగి

- కేసు దర్యాప్తులో వెలుగులోకి వాస్తవాలు
- విశాఖ కేంద్రంగా బయటపడిన మ్యూల్ గ్యాంగ్ ఆగడాలు
- సైబర్ నేరగాళ్లకు నకిలీ సిమ్‌కార్డుల విక్రయం
- ఏడుగురు సభ్యులు అరెస్టు


పట్టుబడిన నిందితులతో సైబర్ క్రైం ఏసీపీ తేజేశ్వరరావు, సీఐ శివాజీ, ఎస్సై మూర్తి

విజయవాడ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): "మీరు సినీనటి శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాతో రోజూ టచ్‌లో ఉంటున్నారు. ముంబైలో ఆయన నేరాలు చేసి సంపాదించిన డబ్బు మీ అకౌంట్‌లో జమ అవుతోంది. మీ పేరు మీద అక్కడ రెండు బ్యాంక్ అకౌంట్లు ఉన్నాయి. మీరు ముంబై క్రైమ్ బ్రాంచ్ ముందు విచారణకు హాజరుకావాలి. ముందు మేం చెప్పిన అకౌంట్‌లో రూ.30 లక్షలు జమ చేయండి. ఈ నేరాలతో ఎలాంటి సంబంధం లేదని తేలితే డబ్బు తిరిగి ఇచ్చేస్తాం."

...నగరానికి చెందిన ప్రభుత్వ మాజీ ఉద్యోగికి ఓ వ్యక్తి వీడియోకాల్ చేసి చెప్పిన మాటలివి. ఇది నిజమేనని నమ్మిన ఆయన అవతలి వ్యక్తులు చెప్పినట్టు బ్యాంకు అకౌంట్లో డబ్బు డిపాజిట్ చేశారు. ఆనక మోసపోయానని గ్రహించి విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు ఈ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. తీగలాగితే డొంకంతా కదిలినట్టు విశాఖపట్నం కేంద్రంగా సిమ్ కార్డులు విక్రయించే మ్యూల్ గ్యాంగ్ బాగోతం బయటపడింది. ఏడుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు శనివారం ఆ వివరాలు వెల్లడించారు.

కొద్దిరోజుల క్రితం విజయవాడ సూర్యారావుపేటకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగికి ముంబై సైబర్ క్రైమ్ డీసీపీనని చెప్పి ఓ వ్యక్తి వీడియోకాల్ చేశాడు. రాజ్‌కుంద్రా చేసిన మోసాల ద్వారా సంపాదించిన డబ్బు రిటైర్డ్ ఉద్యోగి అకౌంట్లలో జమ అవుతున్నాయని, ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని హిందీ, ఇంగ్లీష్‌లో చెప్పాడు. వాట్సాప్‌లో ఆయన ఎఫ్ఐఆర్, అరెస్టు వారెంట్ కాపీలను పంపించాడు. ఇవి చూడగానే రిటైర్డ్ ఉద్యోగి ఆందోళన చెందారు. ఫోన్ చేసిన వ్యక్తి నిజంగా డీసీపీ అని భావించాడు. అతడిని బతిమాలుకోగా, దఫదఫాలుగా తాను చెప్పిన అకౌంట్‌లో రూ.30.37 లక్షలు జమ చేయాలని చెప్పాడు. రాజ్‌కుంద్రాతో ఎలాంటి సంబంధం లేదని తేలితే తిరిగి డబ్బు ఇచ్చేస్తామని చెప్పడంతో రిటైర్డ్ ఉద్యోగికి నమ్మకం కలిగింది. డబ్బు ఎంతకీ తిరిగి రాకపోవడం, ముంబై సైబర్ క్రైం బ్రాంచ్ నుంచి ఎలాంటి ఫోన్లు రాకపోవడంతో ఆయనకు ... మిగతా 6వ పేజీలో



మామిడి పండ్ల ప్రదర్శనను ప్రారంభిస్తున్న పి.ఎల్.ఎన్.రాజు



మామిడి పండ్ల విక్రయాలు



రసాయనాలులేని బంగినపల్లి

మామిడి పండ్ల సంతకు స్పందన

- సహజసిద్ధంగా ముగ్గిన పండ్ల విక్రయాలు
- జోరుగా విక్రయాలు

ఎం.వి.పి.కాలనీ, జూన్ 1 : సహజ సిద్ధంగా ముగ్గిన మామిడి పండ్లతో ఎం.వి.పి.కాలనీ గిరిజన్ భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన సంతకు భారీ స్పందన లభించింది. ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధి పి.ఎల్.ఎన్.రాజు ఈ ప్రదర్శన, విక్రయాలను ప్రారంభించారు. రెండు రోజుల ప్రదర్శన, విక్రయాల్లో భాగంగా సుమారు మూడు టన్నుల మామిడి పండ్లను తొలిరోజు విక్రయించారు. సాయంత్రానికే తీసుకువచ్చిన పండ్లు మొత్తం విక్రయంచినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మామిడి సాగు చేస్తున్న రైతులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలన్న ఉద్దేశంతో ఈ సంతను ఏర్పాచేసినట్టు పి.ఎల్.ఎన్.రాజు తెలిపారు. తులసి నేచురల్స్ సత్యనారాయణ, పాలెం నేచురల్స్ చవ్వాకుల అశోక్, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు రోజుల్లో వైసీపీ పాలన నుంచి విముక్తి

- తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి

మహారాణిపేట, జూన్ 1: వైసీపీ పాలననుంచి మరో మూడురోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి రానుందని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎస్.అనంతలక్ష్మి అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో యువత, మహిళలు ఉద్యోగులు, ఎస్సీ ,ఎస్టీ, మైనారిటీ ఇలా అన్ని వర్గాల వారికి ఈనెల 4వతేదీ తర్వాత మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకోవటం, దాచుకోవటం మాత్రమే చేశారన్నారు. కూల్చివేతలు, అ క్రమాలు, విధ్వంసాలతో కాలం వెళ్లదీశారన్నారు. చివరకు తనకు చెందిన భారతి కంపెనీకి చెందిన ఉద్యోగులే రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సొంత కుటుంబ సభ్యులు కూడా జగన్‌ను నమ్మవద్దంటూ ప్రచారంచేశారంటే ఆయన మనస్తత్వాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ స్థితిలో జూన్ నాలుగున వెలువడే ఎన్నికల ఫలితాలతో విముక్తి ఉంటుందని తెలిపారు.ఐదు సంవత్సరాలపాటు రాజధాని లేని రాష్ట్రంగా చేశారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దుతారని తెలిపారు.

విశాఖలో స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా లోపాలు

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎంలు) భద్రపరిచిన ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా లోపాలు ఉన్నాయని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ ఆరోపించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోటీ చేసిన అభ్యర్థులకు గతంలో స్ట్రాంగ్ రూమ్ సీసీ టీవీ యాక్సెస్, లైవ్ లింక్ ఇచ్చారని, ఇప్పుడు ఇవ్వకపోవడానికి గల కారణం ఏమిటో అధికారులను ఎన్నిసార్లు అడిగినా చెప్పలేదన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా వేల కోట్ల రూపాయలు పంపిణీ చేశారని, ఎన్నికల కమిషన్ నిబంధనలను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఎన్నడూ లేనంత దారుణంగా ఏపీలో ఈసారి ఎన్నికలు జరిగాయన్నారు. దేశంలో మళ్లీ నరేంద్ర మోదీయే ప్రధాని కాబోతున్నారన్నారు. విశాఖలో తానే ఎంపీగా గెలవబోతున్నారని, ఐప్యాక్ సర్వేలో ఇదే తేలిందన్నారు. తనకు 6 నుంచి 8 లక్షల ఓట్లు వస్తాయని, 1.5 నుంచి 3 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుస్తానన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటు విక్రయంను కోర్టు ద్వారాఆపించానని తెలిపారు.



మాట్లాడుతున్న కేఏ పాల్

అక్కయ్యపాలెం రోడ్డులో నేలకొరిగిన భారీ వృక్షం

అక్కయ్యపాలెం, జూన్ 1: ఉత్తర నియోజకవర్గం పరిధి అక్కయ్యపాలెం ప్రధాన రహదారి వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. అయితే ఆ సమయంలో సంఘటనా స్థలంలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే చెట్టు కూలిపోవడంతో విద్యుత్ వైర్లకు, కేబుల్ వైర్లు తెగిపోయాయి. జీవీఎంసీ సిబ్బంది రోడ్డుకి అ డ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు.



వైభవంగా హనుమజ్జయంతి

- ఆలయాల్లో భక్తుల రద్దీ... స్వామివారికి అభిషేకాలు, పూజలు



జైలురోడ్డులోని ధ్యానాంజయుడు



వన్‌టౌన్ మెయిన్‌రోడ్డులో ..



సీతమ్మధార టీపీటీ కాలనీలో పూజలు

సీతమ్మధార, జూన్ 1: ఉత్తర నియోజకవర్గం పరిధి 24వ వార్డు సీతమ్మధార టీపీటీ కాలనీలో మైత్రి అపార్టుమెంట్ వద్ద గల అభయ అంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. అర్చకులు అంపోలు చిట్టి రామగోపాల ఆచార్యులు స్వామివారి విగ్రహానికి బంగారు, వెండి ఆభరణాలు, పూల మాలలతో అలంకరించారు. విగ్రహంలో అమెరికన్ డైమండ్స్‌తో చేసిన ఆభరణాలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, తులసి, తమలపాకులతో అభిషేకాలను నిర్వహించారు. సామూహిక సుందరాకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం చేశారు.

డాబాగార్డెన్స్: జైలు రోడ్డులో ధ్యానాంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమజ్జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గోపాజోష్యుల సత్యజగన్నాథశర్మ స్వామివారికి పంచామృత అభిషేకం, అలంకారం, సహస్రనామార్చన, తమలపాకుల పూజ, సింధూర అర్చన, అష్టోత్తర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, పరిసర ప్రాంతవాసులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జగదాంబ కూడలి: హనుమజ్జయంతిపురస్కరించుకుని వన్‌టౌన్ మెయిన్ రోడ్డు ఆలయానికి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున స్వామివారికి అర్చ కులు ప్రత్యేక అర్చనలు, పూజలు జరిపి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల అధిక సంఖ్యలో రావడంతో టిక్కెట్‌తో పాటు సాధారణ దర్శనాల క్యూలన్నీ కిటకిటలాడాయి. గర్భగుడిలో ఆంజనేయుని స్వామికి తమల పాలకులు, నిమ్మకాలు, మల్లెపూల దండలను సమర్పించేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఆలయ ఈవో జగన్నాథరావు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. వన్‌టౌన్‌లోని లక్ష్మీటాకీస్ వద్ద అభయ ఆంజనేయస్వామి, పలు వీధుల్లోని రామాలయాల్లో హనుమజ్జయంతి పూజలను ఘనంగా నిర్వహించారు.

జ్ఞానాపురం: జ్ఞానాపురం, వైర్లెస్‌కాలనీ, కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చయ్యపేట, వెంకటేశ్వరమెట్ట ప్రాంతాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి సింధూర అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

మురళీనగర్; హైవే రోడ్డు పాలిటెక్నిక్ కాలేజీ సమీపాన శ్రీ యోగ సిద్ధాంజనేయ మందిరంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఆలయంలో స్వామి తన్మయ మారుతి అలంకరణలో భక్తులకు దర్శనమిచారు. అయోధ్య శ్రీ రామ్ లల్లా విగ్రహ రూపాన్ని చేతపట్టుకుని ఉన్నట్టు స్వామి వారిని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. అలాగే, సీతారామ కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. ఆలయ వ్యవస్థాపకులు పి.సుబ్బరాజు, యశోద దంపతులు ఈ వేడుకల్లో ఉభయ దేవేరులు, భక్తుల తరపున ప్రాతినిధ్యం వహించారు. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం మందిరం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. అలాగే, పట్టాభిరెడ్డితోట దాసాంజనేయ ఆలయం, మాధవధార హనుమాన్ మందిరాల్లో ఈ జయంత్యుత్సవాలు జరిపారు.

కంచరపాలెం: కంచరపాలెం, తిక్కవానిపాలెం,రెడ్డి కంచరపాలెం రామాలయం, జాషువానగర్ వినాయక ఆలయం, గొల్లకంచరపాలెం, తుమ్మడిపాలెం, ఆశవానిపాలెం, గవర కంచరపాలెం తదితర ఆలయాల్లో ఆంజనేయస్వామివారికి సింధూర అభిషేకం, సుందరాకాండ పారాయణం చేశారు. పలు చోట్ల భక్తులకు అన్నసమారాధన చేశారు.



పాలిటెక్నిక్ కాలేజీ వద్ద హనుమాన్ మందిరంలో అన్నసమారాధనలో భక్తులు



సీతారాములకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయ స్థాయి కమిటీలకు చైర్మన్‌గా రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్

- రాష్ట్రంలోని అన్ని సెంట్రల్ జైళ్లల్లోనూ ఈ-ములాకత్ అమలు చేసినట్టు ఐజీ వెల్లడి



డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), జూన్ 1: జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన నాలుగు కమిటీల్లో రెండు కమిటీలకు రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. శనివారం ఆయన నగరంలోని కేంద్ర కారాగారంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ నూతనంగా నాలుగు కమిటీలు ఏర్పాటుచేసింది. ఇవి దేశంలోని పోలీస్ సంబంధిత శాఖల్లోని సమస్యలను గుర్తించడం, సాంకేతికత అభివృద్ధి, విశ్లేషణ వంటి బాధ్యతలతో పనిచేస్తాయి. దేశవ్యాప్తంగా నిర్మించే నూతన జైళ్లలో ఎలాంటి వసతి సౌకర్యాలు ఉండాలి, సాంకేతికత, పచ్చదనం తదితర అంశాలను అధ్యయనం చేసి ఈ ఏడాదిలోగా నివేదిక ఇవ్వడానికి మూడు కమిటీలను ఏర్పాటు చేశారు. ఫంక్షనల్, టెక్నికల్, గ్రీనరీ విభాగాల్లో ఫంక్షనల్ విభాగానికి ఇండ్ల శ్రీనివాస్‌ను చైర్మన్‌గా నియమించారు. అలాగే ప్రిజన్ ట్రైనింగ్ పాలసీ కమిటీకి కూడా ఆయన్నే చైర్మన్‌గా నియమించారు. ఇది మన రాష్ట్రానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ఐజీ తెలిపారు. కాగా రాష్ట్రంలోని అన్ని సెంట్రల్ జైళ్లల్లోనూ ఖైదీలకుఈ-ములాకత్ అమలు చేసినట్టు ఐజీ శ్రీనివాసరావు తెలిపారు.దీనివల్ల దూర ప్రాంతంలో ఉన్న ఖైదీల కుటుంబీకులు వ్యయ ప్రయాసలు పడి జైళ్లకు రాకుండా వీడియో కాల్ ద్వారా మాట్లాడవచ్చునని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం

జ్ఞానాపురం, జూన్ 1: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారందక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు కందుల నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కంకటాల సతీష్, ముమ్మిడివరపు విజయ్‌కుమార్, పాలూరి వెంకట చిదంబరం, సభ్యులు పాల్గొన్నారు.

పాలీసెట్‌లో 246 మందికి రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్లు చేస్తున్న అధికారులు

కంచరపాలెం, జూన్ 1 : కంచరరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో శనివారం జరిగిన పాలీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా 246 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి రిజిస్ట్రేషన్స్ చేసినట్టు క్యాంప్ అధికారులు డా.కె.వి.రమణ, డా.కె. నారాయణరావు పేర్కొన్నారు. కెమికల్ కళాశాలలో 72 మంది, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 174 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆదివారం కెమికల్ కళాశాలలో 92001 నుంచి లక్ష ర్యాంకు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 100001 ర్యాంకు నుంచి 108000 ర్యాంకు వరకు గల అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ జరగనున్నది. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు అన్నీ ధ్రువపత్రాలతో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని అధికారులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



మృతిచెందిన శ్రీలక్ష్మి (ఫైల్‌ఫొటో)

సీతమ్మధార, జూన్ 1: ఆర్థిక సమస్యలతో నక్కవానిపాలెం ప్రాంతానికి చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి. నక్కవానిపాలెంలో బాదిరెడ్డి అప్పారావు, శ్రీలక్ష్మి (41), లు దంపతులు నివాసముంటున్నారు. శ్రీలక్ష్మి సీతమ్మధార రైతుబజార్‌లో కూరగాయలు విక్రయిస్తుండగా, అప్పారావు స్థానికంగా పెట్రోల్ బంక్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అయితే, ఆర్థిక ఇబ్బందులతోపాటు అప్పు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి కొద్దిరోజులుగా వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీలక్ష్మి శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరులేనిసమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడారు. సమాచారం మేరకు ఎంవీపీ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీలక్ష్మి మృతితో రైతు బజార్‌లో విషాదం నెలకొంది రైతులు, తోటి వ్యా పారులు, బజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకులు సతీష్ సంతాపం తెలిపారు.

అన్నవరంలో గతంలోనే భూసమీకరణ

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి హక్కులు లేవని కోర్టుకు నివేదించామన్నారు. అన్నవరంలో తీసుకున్న భూములకు పరిహారం చెల్లించామన్నారు. వీఎంఆర్డీఏ అధికారులు వెళ్లి సర్వే చేశారన్న ఆరోపణలపై విచారణ జరిపిస్తామన్నారు. ఇక డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ అనుమతులు జారీలో ఎటువంటి ఒత్తిళ్లు లేవని, నిబంధనల మేరకు కమిటీలో పెట్టి ఆమోదిస్తున్నామని చెప్పారు. ఫ్రీ హోల్డ్ అనుమతుల వ్యవహారంలో తప్పులు చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర కారాగారానికి ఎనీ టైమ్ క్లీనిక్ మెషిన్



మెషిన్ ప్రారంభిస్తున్న జైళ్లశాఖ ఐజీ, అధికారులు

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ, జూన్ 1 : నగ రంలోని కేంద్ర కారాగా రానికి ఓ సంస్థ శనివారం ఎనీ టైమ్ క్లీనిక్ మెషిన్ ను వితరణగా అంద జేసింది. దాతల నుంచి జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్ ఈ మెషిన్ ను అందుకున్నారు. చిన్నపాటి రక్త పరీక్షతో ఆక్సిజన్, గ్లూకోజ్ లెవెల్స్, కొలెస్ట్రాల్, ఆల్కహాల్, బి.పి, తదితర 73 రకాల ఫలితాలను ఈ యంత్రం ద్వారా తెలుసుకో వచ్చు. దీని ఖరీదు రూ. 10.50 లక్షలు. వైద్యులు, ల్యాబ్ టెక్నిషియన్స్ లేకుండానే 24 గంటల పాటు పనిచేసే ఈ యంత్రాన్ని జైళ్ల శాఖలో మొదటిసారిగా ప్రవేశ పెడుతున్నారు. ఖైదీలు నేరుగా ఈ పరీక్షలను చేసుకునే వెసులు బాటు ఉంటుంది. అలాగే మూడు నిమిషాల్లో పరీక్ష ఫలితాలు రావడం దీని ప్రత్యేకత. హైదరాబాదుకు చెందిన జెమ్ ఓపెన్ క్యూబ్ టెక్నాలజీ సంస్థ దీన్ని తయారు చేసింది. గతంలో ఎనీ టైమ్ గోల్డ్, టీ, కాఫీలను అందించే వెండింగ్ మెషిన్‌లను ఈ సంస్థ తయారు చేసింది. తయారీ సంస్థతో పాటు నగరంలోని ఐటీ సంస్థ సింబయోసిస్ టెక్నాలజీస్ సం యుక్తంగాఈ మెషిన్‌ను అందించాయి. జైలు పర్యవేక్షణాధికారి కిషోర్‌కుమార్ చొరవతో ఈ యంత్రాన్ని కారాగారానికి అందించినట్లు ఆ ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు.

సింగపూర్ హార్బర్‌లో ఐఎన్ఎస్ శివాలిక్



సింగపూర్‌లో ఐఎన్ఎస్ శివాలిక్ నౌక

విశాఖపట్నం, జూన్ 1: భారత్ నేవీకి చెందిన ఐఎన్ఎస్ శివాలిక్ నౌక సింగపూర్ చేరింది. అక్కడి నేవీ అధికారుల ఆహ్వానం మేరకు శివాలిక్ సింగపూర్ వెళ్లింది. అక్కడి పలు పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు ఐఎన్ఎస్ శివాలిక్‌ను సందర్శించారు. ఆస్ట్రేలియన్ హై కమిషనర్ ఐఎన్ఎస్ శివాలిక్ అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు.

రాత్రి 9 తరువాతే...

... 5వ పేజీ తరువాయి

లేదన్నారు. సాధ్యమైనంత వరకూ సెల్‌ఫోన్లు తీసుకురాకుండా ఉంటే మంచిదని పేర్కొంటూ ఒకవేళ తీసుకువచ్చినా వాటిని బయట ఒక కౌంటర్‌లో డిపాజిట్ చేయాలన్నారు. సెల్‌ఫోన్ల భద్రతకు తాము గ్యారంటీ ఇవ్వబోమని స్పష్టంచేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తరలింపు మొత్తం ప్రక్రియ సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.

పార్లమెంటుకు 104, ఏడు అసెంబ్లీ స్థానాలకు 98, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 51 టేబుళ్లు ఏర్పాటుచేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు క్రమశిక్షణతో మెలగి లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించాలని కోరారు. గొడవలు సృష్టించేందుకు యత్నిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల భద్రత ఉంటుందని పేర్కొన్నారు. ఆర్వో అనుమతి లేకుండా ఎవరూ లోపలకు రాకూడదని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందని గుర్తుచేస్తూ ఓట్ల లెక్కింపు తరువాత విజేతలైన అభ్యర్థులు, రాజకీయ పార్టీల విజయోత్సవ ర్యాలీలు, మందుగుండు సామగ్రి కాల్చడం నిషేధించామన్నారు. దయచేసి ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నియమావళి మేరకు నడుచుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రశాంతమైన నగరంగా విశాఖకు పేరుందని, ఇప్పటివరకూ జిల్లాలో ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగలేదన్నారు. ఈ నెల ఆరోతేదీ వరకు కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. మూడో తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి నాలుగో తేదీ అర్ధరాత్రి వరకు మద్యం దుకాణాలు మూసివేస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం సిబ్బందికి ఒక విడత శిక్షణ ఇచ్చామని, ఆదివారం రెండో విడత శిక్షణ ఇచ్చి ర్యాండమైజేషన్ పూర్తిచేస్తామన్నారు. సిబ్బందిని కౌంటింగ్ హాళ్ల వద్దకు తీసుకువెళ్లి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలా ఉంటుందో వివరిస్తామని కలెక్టర్ తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ విభాగం తరపున మూడంచెల భద్రత ఏర్పాటుచేశామన్నారు. కొత్తగా నగరానికి మరో కంపెనీ కేంద్ర బలగాలు, రాష్ట్రానికి చెందిన రెండు ప్లాటూన్ల స్పెషల్ పోలీసులను రప్పించామన్నారు. ఓట్ల లెక్కింపునకు వచ్చే ఏజెంట్లు, సిబ్బంది, మీడియా ప్రతినిధుల వాహనాల పార్కింగ్‌కు సెంటర్లను గుర్తించామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కౌంటింగ్ జరిగే కేంద్రాలకు రెండు కిలోమీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉందని, ఇప్పటికే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించామన్నారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని కోరారు. ఎవరైనా సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వచ్చిన తరువాత కూడా రెచ్చగొట్టే సందేశాలు, పోస్టులు పెట్టవద్దని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

సర్వే సర్వత్రా...

... 5వ పేజీ తరువాయి

ప్రకటించాయి. అలాగే చాణక్య సంస్థ వైసీపీకి 110-120, కూటమికి 55-65, జన్‌మత్ పోల్స్ వైసీపీకి 95-103, కూటమికి 65-75 సీట్లు వస్తాయని అంచనా వేశాయి.

పార్లమెంటు స్థానాల విషయానికి వస్తే...కూటమికి 21-23, వైసీపీకి 2-4 సీట్లు వస్తాయని ఇండియా టుడే వెల్లడించింది. అలాగే ఎన్‌డీటీవీ...కూటమికి 18, వైసీపీకి 7, రిపబ్లిక్ టీవీ...కూటమికి 14, వైసీపీకి 11, న్యూస్ 18 ...కూటమికి 19-22, వైసీపీకి 5-8, ఏబీపీ, సీ ఓటర్...కూటమికి 21-22, వైసీపీకి 0-4 సీట్లు వస్తాయని, ఇండియా టీవీ... కూటమికి 21 సీట్లు వస్తాయని ప్రకటించాయి.

విశాఖ జిల్లా చూసుకుంటే...

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో 12 స్థానాలు కూటమికి, 3 వైసీపీకి వస్తాయని పలు సంస్థలు వెల్లడించింది. అరకులోయ, పాడేరు, మాడుగుల స్థానాలు మాత్రమే వైసీపీకి వస్తాయని, మిగిలినవన్నీ కూటమికే దక్కుతాయని విశ్లేషించాయి. జనసేన పోటీ చేసిన నాలుగు (అనకాపల్లి, ఎలమంచిలి, విశాఖపట్నం దక్షిణం, పెందుర్తి) సీట్లు గెలుచుకుంటుందని, విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు గెలుస్తారని తెలిపాలి

'ఆరా' మస్తాన్ ఎగ్జిట్ పోల్స్‌ను వెల్లడిస్తూ రాష్ట్రంలో ప్రముఖులు పోటీ చేసిన చోట ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో చెప్పారు. ఆయన లెక్కల ప్రకారం విశాఖ జిల్లాలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ (గాజువాక) ఓడిపోతున్నారు. అనకాపల్లిలో ఎంపీగా పోటీ చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఓడిపోతారని కూటమిఅభ్యర్థి సీఎం రమేశ్ గెలుస్తారని వెల్లడించారు. విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు నుంచి టైట్ ఫైట్ ఎదుర్కొన్నారని విశ్లేషించారు. విశాఖ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ గెలుపు ఖాయమని, ఆయనకు మెజారిటీ కూడా భారీగా వస్తుందని పలు సంస్థలు విశ్లేషించాయి.

వీడియో కాల్ చేసి.. రూ.30 లక్షలు కొట్టేశారు

... 5వ పేజీ తరువాయి

అనుమానం వచ్చి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వీడియో కాల్ ఏ నెంబర్ నుంచి వచ్చిందో విచారణ చేపట్టారు. సైబర్ క్రైమ్ ఏసీపీ ఎస్‌డీ తేజేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, ఎస్ఐ మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పడింది. వీడియో కాల్ వచ్చిన నంబర్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. వీఐ సర్వీసు ప్రొవైడర్ నంబర్ నుంచి ఈ కాల్ వచ్చినట్టు గుర్తించిన పోలీసులు సిమ్ కార్డు ఏ చిరునామాతో ఉందో అక్కడికి వెళ్లారు. విశాఖపట్నం చిరునామా చూపించడంతో అక్కడికి వెళ్లి విచారణ చేశారు. ఈ సిమ్‌ను ఎక్కడ కొన్నారో కనుగొన్నారు.

ఒకే వేలిముద్రతో రెండు సిమ్‌ల యాక్టివేషన్

కొత్తగా సిమ్‌కార్డు తీసుకునే వారు సంబంధిత సర్వీసు ప్రొవైడర్ వద్దకు గానీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్ వద్దకు గానీ వెళ్లి ఆధార్ జెరాక్స్ చూపించి బయోమెట్రిక్ వేయాలి. 24 గంటల తర్వాత సిమ్ యాక్టివ్ అవుతుంది. ఇలా సిమ్‌ల కోసం వచ్చిన వారి వేలిముద్రతో వారు తీసుకున్న సిమ్‌ను కాకుండా మరో సిమ్‌ను కూడా యాక్టివేట్ చేస్తున్నారని గమనించారు. పోలీసుల విచారణలో తాము ఒక సిమ్ కార్డు మాత్రమే తీసుకున్నామని కొందరు వివరించారు. సిమ్‌కార్డుల కోసం వచ్చిన వారికి ఒకటి అధికారికంగా ఇచ్చి, మరో మ్యూల్ సిమ్‌ను యాక్టివేట్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు గ్యాంగ్ వెలుగులోకి వచ్చింది. విశాఖపట్నం గాజువాక ప్రాంతానికి చెందిన రేపాక రాంజీ, నంబాల నితిన్, విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన తేలు ప్రణయ్‌కుమార్, నంద రూపేష్, కాగితాల సింహాద్రి, ఏలూరు జిల్లా నిడమర్రుకు చెందిన పందిరి సత్యనారాయణ, పాత గాజువాక ప్రాంతానికి చెందిన బండి నారాయణమూర్తిని అరెస్టు చేశారు. నిందితుల్లో రాంజీ వీఐ సర్వీసు ప్రొవైడర్ షోరూమ్‌లో డిజిటల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. నితిన్ మొబైల్ సర్వీసింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. విశాఖపట్నం కేంద్రంగా మ్యూల్ సిమ్‌లను యాక్టివేట్ చేసి వాటిని సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు.

ఒక్కో సిమ్ ఖరీదు రూ.1,500

మ్యూల్ గ్యాంగ్ సిమ్ కార్డులను సైబర్ నేరగాళ్లకు విక్రయించి భారీగానే సొమ్ము చేసుకుంటున్నట్టు పోలీసులు గుర్తించారు. సర్వీసు ప్రొవైడర్ నుంచి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌కు సిమ్‌ను రూ.500కు ఇస్తారు. దీనికి ఎగ్జిక్యూటివ్ మరో రూ.100 లాభం వేసుకుని రూ.600కు డిస్ట్రిబ్యూటర్‌కు విక్రయిస్తాడు. సిమ్‌లను యాక్టివేట్ చేసే క్రమంలో మ్యూల్ సిమ్‌ను సృష్టించిన డిస్ట్రిబ్యూటర్లు, ఏజెంట్లు కలిసి సైబర్ నేరగాళ్లకు ఆ సిమ్‌లను విక్రయిస్తున్నారు. ఒక్కో సిమ్‌కార్డును సైబర్ నేరగాళ్లకు రూ.1,500 వరకు విక్రయించారు. ఇలా మొత్తం 30 సిమ్ కార్డులను సృష్టించినట్టు పోలీసులు గుర్తించారు. వాటిలో 20 సిమ్‌లను సైబర్ నేరగాళ్లకు విక్రయించేశారు. ఇలా సృష్టించిన మరికొన్ని మ్యూల్ సిమ్‌లను సైబర్ క్రైం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, రిటైర్డ్ ఉద్యోగి డబ్బు జమ చేసిన ఖాతాల వివరాలను రాబట్టిన పోలీసులు అందులో ఉన్న రూ.1.21 లక్షలను స్తంభింపజేశారు. ఈ ఖాతాను పరిశీలించగా, ఒక్కరోజులోనే రూ.6.2 కోట్ల లావాదేవీలు జరిగినట్టు తేలింది.



షీలానగర్ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీరు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 1: భారీ వర్షానికి 68, 69 వార్డుల పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వేకువ జాము వరకు ఈదురు గాలులతో కూలిన వర్షానికి షీలా నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో కుంచుమాంబ ఆలయం వద్ద రోడ్డుపై నీరు నిలిచి పోవడంతో ద్విచక్ర వాహనదారులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే రాంనగర్ రోడ్డులో, తుంగ్లాం-ఆటోనగర్ రహదారిలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు తిష్ఠ వేసింది. కాగా ఈదురు గాలులకు భెల్ హెచ్‌పీవీపీ టౌన్‌షిప్‌లోని అడ్మిన్ కార్యాలయం వద్ద, యూనియన్ కార్యాలయం వద్దనున్న కొన్ని చెట్లు నేల కూలడంతో వాటిని సిబ్బంది తొలగించారు.

గాజువాక: ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి గాజువాకలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం వాటిల్లడంతో ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. శనివారం ఉదయం కాసేపు వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ ఆ తర్వాత మళ్లీ భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు ఠారెత్తిపోయారు.

1,206వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం, జూన్ 1: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,206వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఏపీ సీఎం జగన్ సహకరించడం దారుణమన్నారు. అందువల్లే ఉక్కు కార్మికుల ఆగ్రహ జ్వాలల్లో వైసీపీ పతనం కావడం తథ్యమని, ఈ నెల నాలుగున వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో ఈ విషయం వెల్లడవుతుందని పేర్కొన్నారు. తమిళనాడులోని సేలం ఉక్కు కర్మాగారం, కర్ణాటకలోని భద్రావతి స్టీల్‌ప్లాంటును కేంద్రం ప్రైవేటీకరణ చేయాలని యత్నిస్తే.. ఆ రాష్ట్ర సీఎంలు పోరాడి, వాటిని నిలిపివేశారన్నారు. మన సీఎం జగన్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించడం విరాచకరమన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు నష్టాలను కేంద్రమే భరించాలన్నారు. సొంత గనులను ఉక్కుకు కేటాయించకపోవడం వల్లే కర్మాగారం నష్టాల్లోకి వెళుతుందన్నారు. స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కబడ్డీ పోటీలు

పెదగంట్యాడ, జూన్ 1: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. కబడ్డీ క్రీడాకారులు కె రాంబాబు, బి.హరి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పెదగంట్యాడ ప్రాంతంలోని వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతగా నిలిచిన జట్టుకు శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి రమణ తెలిపారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

భీమునిపట్నం, జూన్ 1 : భీమిలి బీచ్ రోడ్ తిమ్మాపురం వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న తొమ్మిదవ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు శనివారంతో ముగిసాయి. బాలుర విభాగంలో నెల్లూరు, బాలికల విభాగంలో అనంతపురం జట్లు విజేతలుగా నిలిచాయి. 13 జిల్లాల నుంచి 26 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్ ప్రిన్సిపాల్ చైతన్య, వేదాంత సంస్థ వ్యవస్థాపకుడు రాజశేఖర్, ప్రకృతి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ట్రోఫీలు అందజేశారు. కాగా బాలుర విభాగంలో నెల్లూరు, కర్నూలు, తూర్పుగోదావరి జట్లు, బాలికల విభాగంలో అనంతపురం, గుంటూరు, తూర్పు గోదావరి జట్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

సినిమా గైడ్

- **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)
- **లవ్‌మీ :** సంగం, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **రాజుయాదవ్ :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **బాక్ :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 27, టమాటా 34, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 28, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 42, బీరకాయలు 36, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 20, క్యారెట్ 30, దొండకాయలు 18, బంగాళదుంపలు 27, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 160, మునక్కాడలు (కిలో) 40, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 40, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 175, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 34, కీరదోస 22, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 46, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్ద కట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 24, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు



బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270



అగనంపూడి ఆటో స్టాండ్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన చెట్టు



శుక్రవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులకు గోపాలపట్నంలోని శ్రీరామ్‌నగర్ ప్రధాన రహదారిలో విద్యుత్ వైర్లపై పడిన భారీ వృక్షం



అగనంపూడిలోని అన్నపూర్ణానగర్‌లో ఓ ఇంటిపై పడిన చెట్టు

ఈదురు గాలుల బీభత్సం

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం

చెట్లు, స్తంభాలు కూలడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రజలు

81వ వార్డులో రోజంతా విద్యుత్ కోత

గోపాలపట్నం, జూన్ 1: ఈదురుగాలులు శుక్రవారం రాత్రి బీభత్సం సృష్టించాయి. గాలులకు తోడు ఉరుమురు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి ప్రజలు భయాందోళనకు గురయ్యారు. శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు పిడుగులు, గాలులతో కూడిన వర్షానికి పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. ఈదురు గాలుల వల్ల చాలా చోట్ల దుకాణాలపై గల రేకుల షెడ్లు ఎగిరిపోవడంతో పాటు చెట్ల కొమ్మలు విరిగిపడి పడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం వాటిల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శనివారం ఉదయం ఎనిమిది గంటల తర్వాతే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది లకు గురయ్యారు.



వడ్లపూడిలో ఈదురు గాలులకు నేలకూలిన చెట్టు



హైవేపై పడిన చెట్లను ఎక్స్‌కవేటర్‌తో పక్కకు తొలగిస్తున్న సిబ్బంది



శనివారం రాత్రి అంధకారంలో ఉన్న 86వ వార్డులోని సాయిరాంనగర్ కాలనీ

అగనంపూడి పరిసరాల్లో..

అగనంపూడి: అగనంపూడిలో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. ఒంటిగంట నుంచి తెల్లవారుజాము మూడు గంటల వరకు ఈదురు గాలులు వీయడంతో పాటు ఉరుములు, మెరుపులు పిడుగుల శబ్దాలతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గాలుల కారణంగా పలు చోట్ల చెట్లు నేలకొరగంతో పాటు విద్యుత్ తీగలు తెగి పడ్డాయి. దీంతో అగనంపూడి పరిసర ప్రాంతాల్లో అర్ధరాత్రి నుంచి శనివారం రాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఉక్కపోతతో నానాపాట్లు పడ్డారు. అగనంపూడి కూడలిలోని ఆటో స్టాండ్ వద్ద భారీ వృక్షం ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. అలాగే అన్నపూర్ణానగర్‌లోని ఓఇంటిపై చెట్టు పడడంతో నివాసితులు భయాందోళకు గురయ్యారు. అగనంపూడి ఆర్టీవో కార్యాలయానికి సమీపంలో రోడ్డుకు ఇరుపక్కలా పలు చెట్లు పడిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పెట్రోల్ బంక్ సమీపంలో ఓ చెట్టు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది.

సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

ఈదురు గాలుల మూలంగా అగనంపూడి, పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో చెట్లు పడిపోవడంతో పాటు విద్యుత్ తీగలు తెగిపడడంతో జీవీఎంసీ, ఈపీడీసీఎల్ అధికారులు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై పడిన చెట్లను ఎక్సకవేటర్ల సాయంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీతారామయ్య, కోటేశ్వరరావు దగ్గరుంచి తీయించారు. ట్రాన్స్‌ఫార్మర్లపై పడిన చెట్లను ఈఈ రామకృష్ణ, ఏడీఈ పార్థసారథి, డీఈఈ వరప్రసాద్, ఏఈ లక్ష్మణరావులు దగ్గరుండి తొలగించాక విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వడ్లపూడి పరిసర ప్రాంతాల్లో..

కూర్మన్నపాలెం: ఈదురు గాలుల ధాటికి 87వ వార్డు పరిధి వడ్లపూడితో పాటు పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. అలాగే సంతమామిడితోట, అప్పికొండ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. దీంతో ఈపీడీసీఎల్ అధికారులు రాత్రి నుంచి యుద్ధప్రా తిపదిన పనుగు చేస్తూ కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు, మరికొన్ని ప్రాంతాలకు శనివారం నాటికి విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టామని అధికారులు పార్థసారథి, శ్రీనివాసరావు, రామకృష్ణ తెలిపారు.

చీకట్లో నరకయాతన అనుభవిస్తున్నాం..

కాగా 86వ వార్డులోని పలు ప్రాంతాలకు శనివారం రాత్రి తొమ్మిది గంటలైనా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో తాము ఉక్కపోతతో ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈపీడీసీఎల్ ఏఈ లక్ష్మణరావుకు, లైన్‌మన్‌కు ఫోన్లు చేస్తుంటే స్విచ్ ఆఫ్ వస్తున్నాయని వారు ఆరోపించారు. సమస్య ఏదైనా ఉంటే ప్రజలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు, ఉందా లేదా అని టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. చినయాత పాలెం, సాయిరాం నగర్, లక్కరాజుపాలెం, కోళ్ల పారం గ్రామాల్లో సుమారు 21 గంటలుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో అష్టకష్టాలు పడుతున్నారు. సంబంధిత తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.



వడ్లపూడిలో పంచముఖ ఆంజనేయస్వామి



గాజువాకలోని ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు



శాతవాహననగర్‌లో పూజలందుకున్న స్వామి

భజే వాయుపుత్ర..

వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

పలు ప్రాంతాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు

మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధనలు

కూర్మన్నపాలెం, జూన్ 1: శ్రీరామదూత హనుమజ్జయంతి వేడుకలను శనివారం పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వహించారు. 86వ వార్డు శాతవాహన నగర్‌లోన అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు తమలపాకులు, నిమ్మకాయల దండలతో అలంకరించి సింధూరంతో అర్చనలు జరిపారు. సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసాను పలువురు మహిళలు పఠిం చారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. 87 వార్డు వడ్లపూడిలోని పంచముఖ అభయాంజనేయ స్వామి ఆలయంలో జరిగిన సామూహిక పూజల్లో కార్పొరేటర్ బొండా జగన్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. కణితి, దుగ్గపువాని పాలెంతో పాటు 88వ వార్డు దువ్వాడ సెక్టర్-1లోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో పూజలు జరపగా, కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో సంస్థ ప్రతినిధులు బండి సురేశ్‌కుమార్, పద్మజ, వీవీకృష్ణారావు, రాజ్యలక్ష్మి, సజ్జా పాండురంగప్రసాద్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు. 87వ వార్డు కణితి కాళింగులవీధిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి సింధురంతో పాటు తమలపాకులతో పూజలు జరిపారు. గవర వీధిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో, పాత కూర్మన్నపాలెంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని నిర్వహించారు. ఎస్టీబీఎల్, ఎల్ఎన్ గార్డెన్స్‌లో, రాజీవ్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు జరిపారు.

ఆటోనగర్: ఇక్కడి ఆఫీషియల్ కాలనీలో సువర్చలాంబ సమేత శ్రీవిద్యా మారుతి మందిరంలో ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు, సామూహిక పూజలు, హోమాలు జరిపారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను సాంస్కృతిక కార్యక్రమాల ఊరేగించారు. 70వ వార్డు శ్రీనివాసనగర్‌లో, చట్టివానిపాలెంలోని వైకుంఠనారాయణ అవతార క్షేత్రంలో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు.

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్: గాజువాక ప్రాంతంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్న సమారాధనలు చేపట్టారు. గాజువాకలోని ఆలయంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు అంజనీపుత్రునికి ప్రత్యేక పూజలు చేశారు. స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సమితిలో నిర్వహించిన వేడుకల్లో హనుమాన్ చాలీసాను భక్తులు పఠించారు. ఆధ్యాత్మిక గురువు జయకామేశ్వరి హనుమాన్ అష్టోత్తర పూజ జరిపారు.



శారదా పీఠంలో స్వామికి హారతిస్తున్న పీఠాధిపతి



షీలానగర్‌లో అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీఠం ప్రాంగణంలో గల దాసాయంజనేయ ఆలయంలో కొలువుదీరిన 18 అడుగుల ఏకశిల స్వామి వారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలను పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి నిర్వహించారు. అభిషేకాలతో పాటు సింధూర పూజను తమలపాకులతో అర్చనను నేత్రపర్వంగా జరిపారు. పలువురు భక్తులు ఆంజనేయస్వామి అష్టోత్తర శతనామావళి, హనుమాన్ చాలీసాను పఠించారు. పీఠాధిపతి భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ హనుమాన్ ఆరాధానతో మహా పరాక్రమవంతులవుతారన్నారు. అలాగే చినముషిడివాడలోని కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్త సేనాపతి శంకరరావు ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు, సింధూర పూజ, తమలపాకులతో అర్చన నిర్వహించారు. కార్పొరేటర్ సేనాపతి వసంత, పలువురు భక్తులు పాల్గొన్నారు. ప్రశాంతినగర్, పెందుర్తి పాత పీహెచ్‌సీ, చినముషిడివాడలోని సప్తగిరినగర్, శ్రమశక్తినగర్ గల స్వామివారి ఆలయాల్లో పూజలు జరిపారు.

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలో గల జింక్ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఆశీనులను చేసి గర్భగుడి చుట్టూ ప్రదక్షణలు చేశారు. రాత్రి అన్న సమారాధన చేపట్టారు. శ్రీహరిపురం వైష్ణవి ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోనూ పూజలు చేయడంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. మల్కాపురం ప్రధాన కూడలిలోని ఆంజనేయస్వామి ఆలయంలోనే, 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో శ్రీరామభక్తుడు కె.శ్రీను ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: గెంజిపేటలోని అభయాంజనేయస్వామిని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దంపతులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. జాతీయ రహదారి కూడలి వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయంలో లారీ ఓనర్ల ఆధ్వర్యంలో పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేపట్టారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రధానార్చకులు కొమ్మాజోస్యుల రామారావు ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారికి తమలపాకులు, సింధూరంలో అర్చన చేసి వడలు, నిమ్మకాయల మాలలను వేశారు. తుంగ్లాం ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, మింది, నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం రామాలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు.

ఎన్.ఎ.డి.జంక్షన్/వేపగుంట: ఎన్ఏడీ ప్రమద విశ్వేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో తమలపాకులు, సింధూరంతో, 90వ వార్డు కాకానీనగర్ ఈశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న వీర హనుమాన్‌కు అర్చనలు, సింధూర పూజలు నిర్వహించారు. నాయుడుతోట రవినగర్ శేషాద్రికొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలోని అభయాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, సింధూరార్చన, తదితర పూజలు చేశారు. నాయుడుతోట వీరాంజనేయస్వామి ఆలయంలో, వేపగుంట ముత్యాలమ్మ ఆలయంలోని స్వామికి, భరత్‌నగర్ సమీపంలోని గోపీజనవల్లభస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామి పూజలు జరిపారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

సజావుగా ఓట్ల లెక్కింపు చేపట్టాలి

రిటర్నింగ్, పోలీస్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున రిటర్నింగ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం రిటర్నింగ్ అధికారుల, పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగున ఏయూలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనున్నందున అందరూ చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ పత్రాలు పొందినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు ముగిసేంత వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు భద్రతలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఏసీపీని నియమించామని, కాబట్టి పోలీస్ అధికారులు ముందుగానే తమ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించుకోవాలని ఆదేశించారు.

పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కోసం 104 టేబుళ్లు, అసెంబ్లీ నియోజకవర్గాలకు 98 టేబుళ్లు సిద్ధం చేసినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డులు పొందిన వారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఏజెంట్లు ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశిస్తే మళ్లీ కౌంటింగ్ ముగిసేంత వరకు బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండదన్నారు. ఇతరత్రా కారణాల వల్ల బయటకు వెళ్లాల్సి వస్తే తిరిగి లోపలకు వచ్చే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఏజెంట్లకు కూడా ఇదే వర్తిస్తుందన్నారు.

సీపీ ఎ.రవిశంకర్ అయ్యనార్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జేసీ కె మయూర్ అశోక్, రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను ‘భవిత’లో చేర్పించాలి

గోపాలపట్నం, జూన్ 1: ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత పాఠశాలల్లో చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష జిల్లా కో-ఆర్డినేటర్ బి.గీత కోరారు. బాజీ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవసరాల గల చిన్నారుల గుర్తింపు సర్వేను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని పలువురు పిల్లల తల్లిదండ్రులతో ఆమె మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యాభ్యాసంతో పాటు వారికి ఉజ్వల భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.ధనలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, జూన్ 1: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలోని శ్రీఅయ్యప్ప సుబ్రహ్మణ్య సహిత సంపత్ వినాయక ఆలయం 25వ వార్షికోత్సవ వేడుకలను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆధ్వర్యంలో వేడుకలను పురస్కరించుకొని స్వామి వారికి పంచామృతాభిషేకంతో పాటు శ్రీలక్ష్మీగణ పతి హోమం, పూర్ణాహుతి, వెండి కవచధారణ, ప్రత్యేక హారతి వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, నారాయణరావు, మజ్జి శ్రీను, మడుగుల నరసింగరావు, బి. సత్యనారాయణ, అప్పలరాజు, దుర్గినాయుడు, సోమేశ్వర రావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నృత్య, సంగీత పోటీల్లో పలువురికి అవార్డులు



అవార్డులు సాధించిన కళాకారులు

పెదగంట్యాడ, జూన్ 1: అఖిల్‌లోక్ కళా సాంస్కృతిక సంస్థ భారత్ ఉత్సవ్ పేరిట మే 16 నుంచి పది రోజుల పాటు పుణెలో నిర్వహించిన అంతర్జాతీయ సంగీత, నృత్య పోటీల్లో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు ఉత్తమ కళాకారులుగా ఎంపికై అవార్డులు సాధించారు. క్లాసికల్ డ్యాన్స్ సబ్ జూనియర్స్ విభాగంలో దీక్షిత, రిషితలు ప్రథమ స్థానంలో, మోక్ష, జాహ్నవి ద్వితీయ స్థానంలో నిలిచారు. సబ్ జూనియర్స్ సోలో విభాగంలో శ్రీవల్లి, శివాయణి తృతీయ స్థానం సాధించారు. గ్రూప్ డ్యాన్స్ క్లాసికల్‌లో నిర్మల అకాడమీ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో, సీనియర్స్ సోలోలో రేణుక, యామిని ప్రథమ స్థానంలో, ఓపెన్ సోలోలో శ్రీవిజయ, సరస్వతి సాహు, రోహిణి వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. డ్యూయెట్ విభాగంలో చరీశ్, నవ్య దీపిక ప్రథమ, తనూజ, హేమ తృతీయ స్థానాలను సొంతం చేసుకున్నారు. అలాగే కర్ణాటక శాస్త్రీయ సంగీతానికి సంబంధించి క్లాసికల్‌లో హర్షనందన్ ప్రథమ స్థానంలో నిలిచాడు.

8న వేదమాత గాయత్రి ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వేపగుంట, జూన్ 1: నాయుడుతోటలో కొలువుదీరిన వేదమాత గాయత్రి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈ నెల ఎనిమిదో తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి కన్నా, ముత్తా నాయుడు, బి.రమణి, మహేశ్, మామిడి కిరణ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వాంబే కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెదగంట్యాడ: హనుమజ్జయంతిని పురస్కరిం చుకుని 65వ వార్డు వాంబే కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దాసాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఐలా చైర్మన్ సత్యనారాయణ రెడ్డి (రఘు) విగ్రహావిష్కరణ చేసి స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆయల ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, పాపారావు, ఆళ్ల కేశవ, ఎం.అప్పలరెడ్డి, పి.రాజు, జి.రామలక్ష్మి, పి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

63వ వార్డులో అధ్వానంగా మురుగు కాలువలు

సింధియా, జూన్ 1: జీవీఎంసీ 63వ వార్డు పరిధి జైయాంధ్ర కాలనీ, కాకరలోవ కొండ ప్రాంతంలో మురుగు కాలువలు అధ్వానంగా మారడంతో స్థానికలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కడికక్కడ కాలువలు పాడైపోవడంతో దిగువ ప్రాంతానికి మురుగు నీరు ప్రవహించక ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. దీంతో తీవ్ర దుర్గంధంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దోమల ధాటికి వ్యాధులు, జ్వరాలు ప్రబలుతాయని భయాందోళన చెందుతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు మురుగు కాలువలకు మరమ్మతులు చేపట్టవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.


మామిడి పండ్ల ప్రదర్శనను ప్రారంభిస్తున్న పి.ఎల్.ఎన్.రాజు


మామిడి పండ్లు విక్రయాలు


రసాయనాలులేని బంగినపల్లి

మామిడి పండ్ల సంతకు స్పందన

- సహజసిద్ధంగా ముగ్గిన పండ్ల విక్రయాలు
- జోరుగా విక్రయాలు

ఎం.వి.పి.కాలనీ, జూన్ 1 : సహజ సిద్ధంగా ముగ్గిన మామిడి పండ్లతో ఎం.వి.పి.కాలనీ గిరిజన్ భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన సంతకు భారీ స్పందన లభించింది. ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధి పి.ఎల్.ఎన్.రాజు ఈ ప్రదర్శన, విక్రయాలను ప్రారంభించారు. రెండు రోజుల ప్రదర్శన, విక్రయాల్లో భాగంగా సుమారు మూడు టన్నుల మామిడి పండ్లను తొలిరోజు విక్రయించారు. సాయంత్రానికే తీసుకువచ్చిన పండ్లు మొత్తం విక్రయంచినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మామిడి సాగు చేస్తున్న రైతులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలన్న ఉద్దేశంతో ఈ సంతను ఏర్పాచేసినట్లు పి.ఎల్.ఎన్.రాజు తెలిపారు. తులసి నేచురల్స్ సత్యనారాయణ, పాలెం నేచురల్స్ చవ్వాకుల అశోక్, వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు రోజుల్లో వైసీపీ పాలన నుంచి విముక్తి

- తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి

మహారాణిపేట, జూన్ 1: వైసీపీ పాలననుంచి మరో మూడురోజుల్లో ఆంధ్రప్రదేశ్‌కు విముక్తి రానుందని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎస్.అనంతలక్ష్మి అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో యువత, మహిళలు ఉద్యోగులు, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ ఇలా అన్నివర్గాల వారికి ఈనెల 4వతేదీ తర్వాత మంచి రోజులు రాబోతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకోవటం, దాచుకోవటం మాత్రమే చేశారన్నారు. కూల్చివేతలు, అ క్రమాలు, విధ్వంసాలతో కాలం వెళ్లదీశారన్నారు. చివరకు తనకు చెందిన భారతి కంపెనీకి చెందిన ఉద్యోగులే రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సొంత కుటుంబ సభ్యులు కూడా జగన్‌ను నమ్మవద్దంటూ ప్రచారంచేశారంటే ఆయన మనస్తత్వాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ స్థితిలో జూన్ నాలుగున వెలువడే ఎన్నికల ఫలితాలతో విముక్తి ఉంటుందని తెలిపారు.ఐదు సంవత్సరాలపాటు రాజధాని లేని రాష్ట్రంగా చేశారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చి దిద్దుతారని తెలిపారు.

విశాఖలో స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా లోపాలు

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎంలు) భద్రపరిచిన ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా లోపాలు ఉన్నాయని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ ఆరోపించారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోటీ చేసిన అభ్యర్థులకు గతంలో స్ట్రాంగ్ రూమ్ సీసీ టీవీ యాక్సెస్, లైవ్ లింక్ ఇచ్చారని, ఇప్పుడు ఇవ్వకపోవడానికి గల కారణం ఏమిటో అధికారులను ఎన్నిసార్లు అడిగినా చెప్పలేదన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా వేల కోట్ల రూపాయలు పంపిణీ చేశారని, ఎన్నికల కమిషన్ నిబంధనలను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఎన్నడూ లేనంత దారుణంగా ఏపీలో ఈసారి ఎన్నికలు జరిగాయన్నారు. దేశంలో మళ్లీ నరేంద్ర మోదీయే ప్రధాని కాబోతున్నారన్నారు. విశాఖలో తానే ఎంపీగా గెలవబోతున్నారని, ఐప్యాక్ సర్వేలో ఇదే తేలిందన్నారు. తనకు 6 నుంచి 8 లక్షల ఓట్లు వస్తాయని, 1.5 నుంచి 3 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుస్తానన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటు విక్రయంను కోర్టు ద్వారాఆపించానని తెలిపారు.


మాట్లాడుతున్న కేఏ పాల్

అక్కయ్యపాలెం రోడ్డులో నేలకొరిగిన భారీ వృక్షం

అక్కయ్యపాలెం, జూన్ 1: ఉత్తర నియోజకవర్గం పరిధి అక్కయ్యపాలెం ప్రధాన రహదారి వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. అయితే ఆ సమయంలో సంఘటనా స్థలంలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే చెట్టు కూలిపోవడంతో విద్యుత్ వైర్లకు, కేబుల్ వైర్లు తెగిపోయాయి. జీవీఎంసీ సిబ్బంది రోడ్డుకి అ డ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు.



వైభవంగా హనుమజ్జయంతి

- ఆలయాల్లో భక్తుల రద్దీ... స్వామివారికి అభిషేకాలు, పూజలు


జైలురోడ్డులోని ధ్యానాంజయుడు


వన్‌టౌన్ మెయిన్‌రోడ్డులో ..


సీతమ్మధార టీపీటీ కాలనీలో పూజలు

సీతమ్మధార, జూన్ 1: ఉత్తర నియోజకవర్గం పరిధి 24వ వార్డు సీతమ్మధార టీపీటీ కాలనీలో మైత్రి అపార్టుమెంట్ వద్ద గల అభయ అంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. అర్చకులు అంపోలు చిట్టి రామగోపాల ఆచార్యులు స్వామివారి విగ్రహానికి బంగారు, వెండి ఆభరణాలు, పూల మాలలతో అలంకరించారు. విగ్రహంలో అమెరికన్ డైమండ్స్‌తో చేసిన ఆభరణాలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, తులసి, తమలపాకులతో అభిషేకాలను నిర్వహించారు. సామూహిక సుందరాకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం చేశారు.

డాబాగార్డెన్స్: జైలు రోడ్డులో ధ్యానాంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమజ్జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గోపాజోష్యుల సత్యజగన్నాథశర్మ స్వామివారికి పంచామృత అభిషేకం, అలంకారం, సహస్రనామార్చన, తమలపాకుల పూజ, సింధూర అర్చన, అష్టోత్తర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, పరిసర ప్రాంతవాసులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జగదాంబ కూడలి: హనుమజ్జయంతిపురస్కరించుకుని వన్‌టౌన్ మెయిన్ రోడ్డు ఆలయానికి భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున స్వామివారికి అర్చ కులు ప్రత్యేక అర్చనలు, పూజలు జరిపి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల అధిక సంఖ్యలో రావడంతో టిక్కెట్‌తోపాటు సాధారణ దర్శనాల క్యూలన్నీ కిటికిటలాడాయి. గర్భగుడిలో ఆంజనేయుని స్వామికి తమల పాలకులు, నిమ్మకాలు, మల్లెపూల దండలను సమర్పించేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఆలయ ఈవో జగన్నాథరావు ప్రత్యేకంగా పర్యవేక్షించారు. వన్‌టౌన్‌లోని లక్ష్మీటాకీస్ వద్ద అభయ ఆంజనేయస్వామి, పలు వీధుల్లోని రామాలయాల్లో హనుమజ్జయంతి పూజలను ఘనంగా నిర్వహించారు.

జ్ఞానాపురం: జ్ఞానాపురం, వైర్లెస్‌కాలనీ, కెప్టెన్ రామారావు జంక్షన్, అచ్చయ్యపేట, వెంకటేశ్వరమెట్ట ప్రాంతాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి సింధూర అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

మురళీనగర్; హైవే రోడ్డు పాలిటెక్నిక్ కాలేజీ సమీపాన శ్రీ యోగసిద్ధాంజనేయ మందిరంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఆలయంలో స్వామి తన్మయ మారుతి అలంకరణలో భక్తులకు దర్శనమిచారు. అయోధ్య శ్రీ రామ్ లల్లా విగ్రహ రూపాన్ని చేతపట్టుకుని ఉన్నట్టు స్వామి వారిని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. అలాగే, సీతారామ కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. ఆలయ వ్యవస్థాపకులు పి.సుబ్బరాజు, యశోద దంపతులు ఈ వేడుకల్లో ఉభయ దేవేరులు, భక్తుల తరపున ప్రాతినిధ్యం వహించారు. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం మందిరం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. అలాగే, పట్టాభిరెడ్డితోట దాసాంజనేయ ఆలయం, మాధవధార హనుమాన్ మందిరాల్లో ఈ జయంత్యుత్సవాలు జరిపారు.

కంచరపాలెం: కంచరపాలెం, తిక్కవానిపాలెం,రెడ్డి కంచరపాలెం రామాలయం, జాషువానగర్ వినాయక ఆలయం, గొల్లకంచరపాలెం, తుమ్మడిపాలెం, ఆశవానిపాలెం, గవర కంచరపాలెం తదితర ఆలయాల్లో ఆంజనేయస్వామివారికి సింధూర అభిషేకం, సుందరాకాండ పారాయణం చేశారు. పలు చోట్ల భక్తులకు అన్నసమారాధన చేశారు.


పాలిటెక్నిక్ కాలేజీ వద్ద హనుమాన్ మందిరంలో అన్నసమారాధనలో భక్తులు


సీతారాములకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయ స్థాయి కమిటీలకు చైర్మన్‌గా రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్

- రాష్ట్రంలోని అన్ని సెంట్రల్ జైళ్లల్లోనూ ఈ-ములాకత్ అమలు చేసినట్టు ఐజీ వెల్లడి


డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), జూన్ 1: జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన నాలుగు కమిటీల్లో రెండు కమిటీలకు రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. శనివారం ఆయన నగరంలోని కేంద్ర కారాగారంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ నూతనంగా నాలుగు కమిటీలు ఏర్పాటుచేసింది. ఇవి దేశంలోని పోలీస్ సంబంధిత శాఖల్లోని సమస్యలను గుర్తించడం, సాంకేతికత అభివృద్ధి, విశ్లేషణ వంటి బాధ్యతలతో పనిచేస్తాయి. దేశవ్యాప్తంగా నిర్మించే నూతన జైళ్లలో ఎలాంటి వసతి సౌకర్యాలు ఉండాలి, సాంకేతికత, పచ్చదనం తదితర అంశాలను అధ్యయనం చేసి ఈ ఏడాదిలోగా నివేదిక ఇవ్వడానికి మూడు కమిటీలను ఏర్పాటు చేశారు. ఫంక్షనల్, టెక్నికల్, గ్రీనరీ విభాగాల్లో ఫంక్షనల్ విభాగానికి ఇండ్ల శ్రీనివాస్‌ను చైర్మన్‌గా నియమించారు. అలాగే ప్రిజన్ ట్రైనింగ్ పాలసీ కమిటీకి కూడా ఆయన్నే చైర్మన్‌గా నియమించారు. ఇది మన రాష్ట్రానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు ఐజీ తెలిపారు. కాగా రాష్ట్రంలోని అన్ని సెంట్రల్ జైళ్లల్లోనూ ఖైదీలకుఈ-ములాకత్ అమలు చేసినట్టు ఐజీ శ్రీనివాసరావు తెలిపారు.దీనివల్ల దూర ప్రాంతంలో ఉన్న ఖైదీల కుటుంబీకులు వ్యయ ప్రయాసలు పడి జైళ్లకు రాకుండా వీడియో కాల్ ద్వారా మాట్లాడవచ్చునని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం

జ్ఞానాపురం, జూన్ 1: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారందక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు కందుల నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కంకటాల సతీష్, ముమ్మిడివరపు విజయ్‌కుమార్, పాలూరి వెంకట చిదంబరం, సభ్యులు పాల్గొన్నారు.

పాలీసెట్‌లో 246 మందికి రిజిస్ట్రేషన్లు


రిజిస్ట్రేషన్లు చేస్తున్న అధికారులు

కంచరపాలెం, జూన్ 1 : కంచరరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో శనివారం జరిగిన పాలీసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా 246 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి రిజిస్ట్రేషన్స్ చేసినట్టు క్యాంప్ అధికారులు డా.కె.వి.రమణ, డా.కె. నారాయణరావు పేర్కొన్నారు. కెమికల్ కళాశాలలో 72 మంది, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 174 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆదివారం కెమికల్ కళాశాలలో 92001 నుంచి లక్ష ర్యాంకు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 100001 ర్యాంకు నుంచి 108000 ర్యాంకు వరకు గల అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ జరగనున్నది. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు అన్నీ ధ్రువపత్రాలతో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని అధికారులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

సీతమ్మధార, జూన్ 1: ఆర్థిక సమస్యలతో నక్కవానిపాలెం ప్రాంతానికి చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. నక్కవానిపాలెంలో బాదిరెడ్డి అప్పారావు, శ్రీలక్ష్మి (41), లు దంపతులు నివాసముంటున్నారు. శ్రీలక్ష్మి సీతమ్మధార రైతుబజార్‌లో కూరగాయలు విక్రయిస్తుండగా, అప్పారావు స్థానికంగా పెట్రోల్ బంక్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అయితే, ఆర్థిక ఇబ్బందులతోపాటు అప్పు ఇచ్చిన వారు ఇంటికి వచ్చి కొద్దిరోజులుగా వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీలక్ష్మి శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరులేనిసమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడారు. సమాచారం మేరకు ఎంవీపీ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీలక్ష్మి మృతితో రైతు బజార్‌లో విషాదం నెలకొంది రైతులు, తోటి వ్యా పారులు, బజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకులు సతీష్ సంతాపం తెలిపారు.


మృతిచెందిన శ్రీలక్ష్మి (ఫైల్‌ఫొటో)

అన్నవరంలో గతంలోనే భూసమీకరణ

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి హక్కులు లేవని కోర్టుకు నివేదించామన్నారు. అన్నవరంలో తీసుకున్న భూములకు పరిహారం చెల్లించామన్నారు. వీఎంఆర్డీఏ అధికారులు వెళ్లి సర్వే చేశారన్న ఆరోపణలపై విచారణ జరిపిస్తామన్నారు. ఇక డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ అనుమతులు జారీలో ఎటువంటి ఒత్తిళ్లు లేవని, నిబంధనల మేరకు కమిటీలో పెట్టి ఆమోదిస్తున్నామని చెప్పారు. ఫ్రీ హోల్డ్ అనుమతుల వ్యవహారంలో తప్పులు చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర కారాగారానికి ఎనీ టైమ్ క్లీనిక్ మెషిన్



మెషిన్ ప్రారంభిస్తున్న జైళ్లశాఖ ఐజీ, అధికారులు

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ, జూన్ 1 : నగ రంలోని కేంద్ర కారాగా రానికి ఓ సంస్థ శనివారం ఎనీ టైమ్ క్లీనిక్ మెషిన్ ను వితరణగా అంద జేసింది. దాతల నుంచి జైళ్ల శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాస్ ఈ మెషిన్ ను అందుకున్నారు. చిన్నపాటి రక్త పరీక్షతో ఆక్సిజన్, గ్లూకోజ్ లెవెల్స్, కొలెస్ట్రాల్, ఆల్కహాల్, బి.పి, తదితర 73 రకాల ఫలితాలను ఈ యంత్రం ద్వారా తెలుసుకో వచ్చు. దీని ఖరీదు రూ. 10.50 లక్షలు. వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్స్ లేకుండానే 24 గంటల పాటు పనిచేసే ఈ యంత్రాన్ని జైళ్ల శాఖలో మొదటిసారిగా ప్రవేశ పెడుతున్నారు. ఖైదీలు నేరుగా ఈ పరీక్షలను చేసుకునే వెసులు బాటు ఉంటుంది. అలాగే మూడు నిమిషాల్లో పరీక్ష ఫలితాలు రావడం దీని ప్రత్యేకత. హైదరాబాదుకు చెందిన జెమ్ ఓపెన్ క్యూబ్ టెక్నాలజీ సంస్థ దీన్ని తయారు చేసింది. గతంలో ఎనీ టైమ్ గోల్డ్, టీ, కాఫీలను అందించే వెండింగ్ మెషిన్‌లను ఈ సంస్థ తయారు చేసింది. తయారీ సంస్థతో పాటు నగరంలోని ఐటీ సంస్థ సింబయోసిస్ టెక్నాలజీస్ సం యుక్తంగాఈ మెషిన్‌ను అందించాయి. జైలు పర్యవేక్షణాధికారి కిషోర్‌కుమార్ చొరవతో ఈ యంత్రాన్ని కారాగారానికి అందించినట్లు ఆ ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు.

సింగపూర్ హార్బర్‌లో ఐఎన్ఎస్ శివాలిక్

విశాఖపట్నం, జూన్ 1: భారత్ నేవీకి చెందిన ఐఎన్ఎస్ శివాలిక్ నౌక సింగపూర్ చేరింది. అక్కడి నేవీ అధికారుల ఆహ్వానం మేరకు శివాలిక్ సింగపూర్ వెళ్లింది. అక్కడి పలు పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు ఐఎన్ఎస్ శివాలిక్‌ను సందర్శించారు. ఆస్ట్రేలియన్ హై కమిషనర్ ఐఎన్ఎస్ శివాలిక్ అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు.


సింగపూర్‌లో ఐఎన్ఎస్ శివాలిక్ నౌక

రాత్రి 9 తరువాతే...

... 5వ పేజీ తరువాయి

లేదన్నారు. సాధ్యమైనంత వరకూ సెల్‌ఫోన్లు తీసుకురాకుండా ఉంటే మంచిదని పేర్కొంటూ ఒకవేళ తీసుకువచ్చినా వాటిని బయట ఒక కౌంటర్‌లో డిపాజిట్ చేయాలన్నారు. సెల్‌ఫోన్ల భద్రతకు తాము గ్యారంటీ ఇవ్వబోమని స్పష్టంచేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తరలింపు మొత్తం ప్రక్రియ సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.

పార్లమెంటుకు 104, ఏడు అసెంబ్లీ స్థానాలకు 98, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 51 టేబుళ్లు ఏర్పాటుచేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు క్రమశిక్షణతో మెలగి లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించాలని కోరారు. గొడవలు సృష్టించేందుకు యత్నిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల భద్రత ఉంటుందని పేర్కొన్నారు. ఆర్వో అనుమతి లేకుండా ఎవరూ లోపలకు రాకూడదని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందని గుర్తుచేస్తూ ఓట్ల లెక్కింపు తరువాత విజేతలైన అభ్యర్థులు, రాజకీయ పార్టీల విజయోత్సవ ర్యాలీలు, మందుగుండు సామగ్రి కాల్చడం నిషేధించామన్నారు. దయచేసి ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నియమావళి మేరకు నడుచుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రశాంతమైన నగరంగా విశాఖకు పేరుందని, ఇప్పటివరకూ జిల్లాలో ఎటువంటి హింసాత్మక ఘటనలు జరగలేదన్నారు. ఈ నెల ఆరోతేదీ వరకు కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. మూడో తేదీ అర్ధరాత్రి 12 గంటల నుంచి నాలుగో తేదీ అర్ధరాత్రి వరకు మద్యం దుకాణాలు మూసివేస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు కోసం సిబ్బందికి ఒక విడత శిక్షణ ఇచ్చామని, ఆదివారం రెండో విడత శిక్షణ ఇచ్చి ర్యాండమైజేషన్ పూర్తిచేస్తామన్నారు. సిబ్బందిని కౌంటింగ్ హాళ్ల వద్దకు తీసుకువెళ్లి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలా ఉంటుందో వివరిస్తామని కలెక్టర్ తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ విభాగం తరపున మూడంచెల భద్రత ఏర్పాటుచేశామన్నారు. కొత్తగా నగరానికి మరో కంపెనీ కేంద్ర బలగాలు, రాష్ట్రానికి చెందిన రెండు ప్లాటూన్ల స్పెషల్ పోలీసులను రప్పించామన్నారు. ఓట్ల లెక్కింపునకు వచ్చే ఏజెంట్లు, సిబ్బంది, మీడియా ప్రతినిధుల వాహనాల పార్కింగ్‌కు సెంటర్లను గుర్తించామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కౌంటింగ్ జరిగే కేంద్రాలకు రెండు కిలోమీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉందని, ఇప్పటికే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని రెడ్ జోన్‌గా ప్రకటించామన్నారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని కోరారు. ఎవరైనా సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వచ్చిన తరువాత కూడా రెచ్చగొట్టే సందేశాలు, పోస్టులు పెట్టవద్దని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

సర్వే సర్వత్రా...

... 5వ పేజీ తరువాయి

ప్రకటించాయి. అలాగే చాణక్య సంస్థ వైసీపీకి 110-120, కూటమికి 55-65, జన్‌మత్ పోల్స్ వైసీపీకి 95-103, కూటమికి 65-75 సీట్లు వస్తాయని అంచనా వేశాయి.

పార్లమెంటు స్థానాల విషయానికి వస్తే...కూటమికి 21-23, వైసీపీకి 2-4 సీట్లు వస్తాయని ఇండియా టుడే వెల్లడించింది. అలాగే ఎన్‌డీటీవీ...కూటమికి 18, వైసీపీకి 7, రిపబ్లిక్ టీవీ...కూటమికి 14, వైసీపీకి 11, న్యూస్ 18 ...కూటమికి 19-22, వైసీపీకి 5-8, ఏబీపీ, సీ ఓటర్...కూటమికి 21-22, వైసీపీకి 0-4 సీట్లు వస్తాయని, ఇండియా టీవీ... కూటమికి 21 సీట్లు వస్తాయని ప్రకటించాయి.

విశాఖ జిల్లా చూసుకుంటే...

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో 12 స్థానాలు కూటమికి, 3 వైసీపీకి వస్తాయని పలు సంస్థలు వెల్లడించింది. అరకులోయ, పాడేరు, మాడుగుల స్థానాలు మాత్రమే వైసీపీకి వస్తాయని, మిగిలినవన్నీ కూటమికే దక్కుతాయని విశ్లేషించాయి. జనసేన పోటీ చేసిన నాలుగు (అనకాపల్లి, ఎలమంచిలి, విశాఖపట్నం దక్షిణం, పెందుర్తి) సీట్లు గెలుచుకుంటుందని, విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు గెలుస్తారని తెలిపాలి

'ఆరా' మస్తాన్ ఎగ్జిట్ పోల్స్‌ను వెల్లడిస్తూ రాష్ట్రంలో ప్రముఖులు పోటీ చేసిన చోట ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో చెప్పారు. ఆయన లెక్కల ప్రకారం విశాఖ జిల్లాలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ (గాజువాక) ఓడిపోతున్నారు. అనకాపల్లిలో ఎంపీగా పోటీ చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఓడిపోతారని కూటమిఅభ్యర్థి సీఎం రమేశ్ గెలుస్తారని వెల్లడించారు. విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు నుంచి టైట్ ఫైట్ ఎదుర్కొన్నారని విశ్లేషించారు. విశాఖ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ గెలుపు ఖాయమని, ఆయనకు మెజారిటీ కూడా భారీగా వస్తుందని పలు సంస్థలు విశ్లేషించాయి.

వీడియో కాల్ చేసి.. రూ.30 లక్షలు కొట్టేశారు

... 5వ పేజీ తరువాయి

అనుమానం వచ్చి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వీడియో కాల్ ఏ నెంబర్ నుంచి వచ్చిందో విచారణ చేపట్టారు. సైబర్ క్రైమ్ ఏసీపీ ఎస్‌డీ తేజేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, ఎస్ఐ మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పడింది. వీడియో కాల్ వచ్చిన నంబర్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. వీఐ సర్వీసు ప్రొవైడర్ నంబర్ నుంచి ఈ కాల్ వచ్చినట్టు గుర్తించిన పోలీసులు సిమ్ కార్డు ఏ చిరునామాతో ఉందో అక్కడికి వెళ్లారు. విశాఖపట్నం చిరునామా చూపించడంతో అక్కడికి వెళ్లి విచారణ చేశారు. ఈ సిమ్‌ను ఎక్కడ కొన్నారో కనుగొన్నారు.

ఒకే వేలిముద్రతో రెండు సిమ్‌ల యాక్టివేషన్

కొత్తగా సిమ్‌కార్డు తీసుకునే వారు సంబంధిత సర్వీసు ప్రొవైడర్ వద్దకు గానీ, సేల్స్ ఎగ్జిక్యూటివ్ వద్దకు గానీ వెళ్లి ఆధార్ జెరాక్స్ చూపించి బయోమెట్రిక్ వేయాలి. 24 గంటల తర్వాత సిమ్ యాక్టివ్ అవుతుంది. ఇలా సిమ్‌ల కోసం వచ్చిన వారి వేలిముద్రతో వారు తీసుకున్న సిమ్‌ను కాకుండా మరో సిమ్‌ను కూడా యాక్టివేట్ చేస్తున్నారని గమనించారు. పోలీసుల విచారణలో తాము ఒక సిమ్ కార్డు మాత్రమే తీసుకున్నామని కొందరు వివరించారు. సిమ్‌కార్డుల కోసం వచ్చిన వారికి ఒకటి అధికారికంగా ఇచ్చి, మరో మ్యూల్ సిమ్‌ను యాక్టివేట్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అసలు గ్యాంగ్ వెలుగులోకి వచ్చింది. విశాఖపట్నం గాజువాక ప్రాంతానికి చెందిన రేపాక రాంజీ, నంబాల నితిన్, విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన తేలు ప్రణయ్‌కుమార్, నంద రూపేష్, కాగితాల సింహాద్రి, ఏలూరు జిల్లా నిడమర్రుకు చెందిన పందిరి సత్యనారాయణ, పాత గాజువాక ప్రాంతానికి చెందిన బండి నారాయణమూర్తిని అరెస్టు చేశారు. నిందితుల్లో రాంజీ వీఐ సర్వీసు ప్రొవైడర్ షోరూమ్‌లో డిజిటల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. నితిన్ మొబైల్ సర్వీసింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. విశాఖపట్నం కేంద్రంగా మ్యూల్ సిమ్‌లను యాక్టివేట్ చేసి వాటిని సైబర్ నేరగాళ్లకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు.

ఒక్కో సిమ్ ఖరీదు రూ.1,500

మ్యూల్ గ్యాంగ్ సిమ్ కార్డులను సైబర్ నేరగాళ్లకు విక్రయించి భారీగానే సొమ్ము చేసుకుంటున్నట్టు పోలీసులు గుర్తించారు. సర్వీసు ప్రొవైడర్ నుంచి సేల్స్ ఎగ్జిక్యూటివ్‌కు సిమ్‌ను రూ.500కు ఇస్తారు. దీనికి ఎగ్జిక్యూటివ్ మరో రూ.100 లాభం వేసుకుని రూ.600కు డిస్ట్రిబ్యూటర్‌కు విక్రయిస్తాడు. సిమ్‌లను యాక్టివేట్ చేసే క్రమంలో మ్యూల్ సిమ్‌ను సృష్టించిన డిస్ట్రిబ్యూటర్లు, ఏజెంట్లు కలిసి సైబర్ నేరగాళ్లకు ఆ సిమ్‌లను విక్రయిస్తున్నారు. ఒక్కో సిమ్‌కార్డును సైబర్ నేరగాళ్లకు రూ.1,500 వరకు విక్రయించారు. ఇలా మొత్తం 30 సిమ్ కార్డులను సృష్టించినట్టు పోలీసులు గుర్తించారు. వాటిలో 20 సిమ్‌లను సైబర్ నేరగాళ్లకు విక్రయించేశారు. ఇలా సృష్టించిన మరికొన్ని మ్యూల్ సిమ్‌లను సైబర్ క్రైం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, రిటైర్డ్ ఉద్యోగి డబ్బు జమ చేసిన ఖాతాల వివరాలను రాబట్టిన పోలీసులు అందులో ఉన్న రూ.1.21 లక్షలను స్తంభింపజేశారు. ఈ ఖాతాను పరిశీలించగా, ఒక్కరోజులోనే రూ.6.2 కోట్ల లావాదేవీలు జరిగినట్టు తేలింది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : సీఐ

పద్మనాభం (రూరల్), జూన్ 1 : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అన్ని గ్రామాల్లోనూ 144, 30 సెక్షన్లు అమలులో ఉన్నాయని సీఐ శ్రీధర్ తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడా నలుగురు గుమికూడి ఉండకూడదన్నారు. బాణసంచా కాల్చరాదని, విజయోత్సవ ర్యాలీలు జరపరాదని చెప్పారు. సోమవారం నుంచి బుధవారం వరకు రాజకీయ కార్యాలయాల వద్ద, అభ్యర్థుల నివాసాల వద్ద జనం ఉండరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పద్మనాభం (రూరల్), జూన్ 1 : పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రేవిడి 11కేవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రేవిడి, రౌతులపాలెం, వెంకటాపురం, బర్లపేట, కురపల్లి, పాండ్రంగి, కొండబర్లపేట ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా నూకరాజు జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, జూన్ 1 : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు జన్మదిన వేడుకలు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ సీనియరు నాయకులు చురకల రమణ, మారోజు సత్యవరప్రసాద్ మాట్లాడుతూ నూకరాజు పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడారు. అనంతరం నూకరాజు, ఆయన సతీమణి, కార్పొరేటర్ అప్పలకొండను సత్కరించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు గొలగాని నరేంద్రకుమార్, తమ్మిన సూరిబాబు, కారి అప్పారావు, మారోజు సంజీవ్‌కుమార్, సంకురుభుక్త జోగారావు, అప్పికొండ నూకరాజు, జలగడుగుల మురళీ, గండిబోయిన పోలిరాజు, తుపాకుల సంతోష్ రాజ్, కంచర్ల కామేష్, దౌలపల్లి హరీష్, కోరాడ రాంబాబు, వాసుపల్లి వంశీ, పిల్లా తాతారావు, ఆవాల సూరిబాబు, సత్తరవు శివ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యం

తగరపువలస, జూన్ 1 : నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యాలయాలు కృషి చేయాలని జాతీయ దంత వైద్య కౌన్సిల్ ఉపాధ్యక్షుడు డా. సతీష్‌కుమార్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన సంగివలస ఎన్‌ఆర్‌ఐ దంత వైద్య కళాశాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన సిబిసిటి స్కాన్ పరికరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పరికరం నోటి వ్యాధులను గుర్తించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. వంశీకృష్ణ, డీన్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

భీమునిపట్నం (రూరల్), జూన్ 1 : మండలంలోని తాళ్లవలసలో ఎక్సైజ్ పోలీసులు శనివారం 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన ఎ. శ్రీను వద్ద అనధికారికంగా మద్యం సీసాలు ఉన్నట్టు సమాచారం రావడంతో దాడి చేసినట్టు ఎస్‌ఐ చిన్నంనాయుడు తెలిపారు. ఈమేరకు అతన్ని అరెస్టు చేశామని చెప్పారు.

'టాలెంట్ హంట్' పోస్టర్ ఆవిష్కరణ

సిరిపురం, జూన్ 1 : నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పేరిట తెలుగు రాష్ట్రాలకు చెందిన యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు టాలెంట్ హంట్ నిర్వహిస్తున్నట్టు నటుడు షాహిద్ అబ్దుల్ తెలిపారు. శనివారం సిరిపురం వీఐపీ రోడ్డులోని ఓ హోటల్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీలో జూన్ 15 వరకు, తెలంగాణలో 17 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తామన్నారు. రెండు దశల్లో ప్రతిభను గుర్తించి విజేతలుగా నిలిచిన వారిని ఫైనల్ పోటీలు ఎంపిక చేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు స్టార్ ఆఫ్ ఇండియా ఇన్‌ను సందర్శించాలన్నారు. ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేదని తెలిపారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో అంధకారం

ఆరిలోవ, జూన్ 1 : హనుమంతవాక జంక్షన్ నుంచి కేంద్ర కారాగారం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో శనివారం వీధి లైట్లు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ రోడ్డును ఆనుకుని ఉన్న వీధుల్లోనూ లైట్లు వెలగలేదు. ఈ రోడ్డులో తరచూ ఈ సమస్య ఏర్పడుతున్నా, అధికారులు స్పందించడం లేదు.

సినిమా గైడ్

● **గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి :** జగదాంబ, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **గం గం గణేశా :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), గణేష్ (తగరపువలస)

● **భజే వాయు వేగం :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస), నటరాజ్-2 (పెందుర్తి)

● **లవ్‌మీ :** సంగం, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **రాజుయాదవ్ :** రమాదేవి, లక్ష్మీకాంత్ (గాజువాక)

● **బాక్ :** వెంకటేశ్వర, లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 27,టమాటా 34, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 28, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 42, బీరకాయలు 36, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 20, క్యారెట్ 30, దొండకాయలు 18, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె) 6, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 160, బరబటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 40, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 175, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 34, కీరదోస 22, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 46, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 60, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 24, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	125
ఫారం ధర	--	145
విత్ స్కిన్	--	260
స్కిన్‌లెస్	--	270



పద్మనాభంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు



సింహాచలం : సాక్షి ఆంజనేయస్వామి ఆలయంలో హోమం

మార్మోగిన హనుమాన్ నామ స్మరణ

ఆలయాల్లో ఘనంగా హనుమజ్జయంతి

భీమునిపట్నం, జూన్ 1 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలోని సుభాష్ రోడ్‌లో ఉన్న సీతారామ లక్ష్మణ సహిత శ్రీదాస ఆంజనేయస్వామి ఆలయంలో తెల్లవారుజామున 5 నుంచి స్వామివారికి అష్టోత్తర శత నారికేళములతో ప్రత్యేక పూజలు జరిపారు.అలాగే స్వామివారికి పంచామృత, ఫలరస, సుగంధజల అభిషేకాలు, భూరిపత్ర, సింధూరార్చనలు, సహస్ర నామ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆసూరి మరింగంటి వంశజుడా మోహన చెన్నకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.సాయంత్రం రామతీర్థం దేవస్థానం శ్రీమాన్ గొడవర్తి నరసింహాచార్యులతో శ్రీహనుమత్ వైభవం పురాణ ప్రవచనం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది.అలాగే బోయవీధి, గొల్లలపాలెం, స్మిత్ వీధి, 4వ వార్డు మంగమారిపేట రామాద్రి, చేపలుప్పాడ జంక్షన్‌లో, కాపుల దిబ్బడిపాలెం, మంగమారిపేట, కల్లివానిపాలెం ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ హనుమత్ జయంతి ఘనంగా జరిగింది.

వెంకోజీపాలెం : హనుమజ్జయంతి పురస్కరించుకుని వాడవాడలా ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్త వెంకోజీపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పూజలు నిర్వహించి, అనంతరం ప్రసాదాన్ని పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోర ధనరెడ్డి, ఆడారి కామేశ్వరరావు, కాళ్ల శంకర్, ఎస్. నరసింహారెడ్డి, గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. అలాగే హెచ్‌బీ కాలనీ ఉక్కు కళావేదికలో లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. అర్చకుడు డి.వెంకటాచార్యుల శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోనూ హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వెంకటాచార్యులు, కార్య దర్శి ఎం. సావిత్రి, కోశాధికారి టి. సుబ్బారాయుడు, మేనేజరు సన్యాసిరావు పాల్గొన్నారు.



భీమిలి పట్టణంలోని శ్రీదాస ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి అలంకరణ

తగరపువలస : తగరపువలస, చిట్టివలస ప్రాంతాల్లోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు. చిట్టివలస రామాలయంలో పంచముఖ ఆంజనేయస్వామికి తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. వైసీపీ నాయకులు ముఖ్యమంత్రిగా జగన్, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలవాలని కోరుతూ పూజలు నిర్వహించారు. తగరపువలస మెయిన్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మహానారాయణసేవ పేరుతో అన్నసమారాధన చేపట్టారు. జీరుపేట రామాలయంలోనూ అన్నదానం చేపట్టారు.

మధురవాడ : మధురవాడ పరిసరాల్లోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. స్వతంత్రనగర్ కాలనీ, బొట్టవానిపాలెం, మారికివలస, బోరవానిపాలెం,మానం ఆంజనేయనగర్, పీఎం పాలెం, అయోధ్య నగర్ ఆలయాల్లో పూజలు, అభిషేకాలు జరిపారు.

ఆరిలోవ : ఆరిలోవలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదగదిలి సమీపంలోని సింహగిరి కాలనీలో ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు మనోహర్ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి ముందుగా పూజలు జరిపిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఈశ్వరరావు, బోను త్రినాథ్, సుంకరి రామసూరి, నీలాపు రామ్‌మోహన్‌రెడ్డి, భాస్కరరావు పాల్గొన్నారు. హనుమంతవాక జంక్షన్‌లో ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయంలోనూ, ఆదర్శనగర్ కూడలిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోనూ, చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలోనూ, రాధాకృష్ణ నగర్‌లో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ, శ్రీకాంత్ నగర్ లేఅవుట్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలోనూ పూజలు చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్ర మాలు కూడా నిర్వహించారు.

సింహాచలం : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయంగా సింహగిరి మెట్ల మార్గంలో, కొండదిగువ స్వామివారి పూదోటలో కొలువైన ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమత్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు చేశారు. తరువాత మెట్ల మార్గంలోని సాక్షి ఆంజనేయునికి పంచామృతాలతో విశేష అభిషేకాలు చేసి, సహస్రనామావళితో తమల పత్రాలు, సింధూరార్చనలు జరిపారు. మూడు రోజుల పాటు జరిగిన సుందరకాండ పారాయణలకు స్వస్తి చెప్పి ప్రత్యేకంగా నిర్వహించిన హనుమ హవనంలో భాగంగా మహా పూర్ణాహుతి జరిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి దంప తులు, దేవాలయ పర్యవేక్షణాధికారి పిల్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండదిగువ స్వామివారి పూదోటలోని ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు స్నపన తిరుమంజనం చేశారు.తరువాత పంచామృతాభిషేకాలు విశేష అలంకరణలు జరిపారు. ఈ ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ నెలకొంది.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వైభవంగా నిర్వహించారు. భక్తుల హనుమాన్ నామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి.పద్మనాభంలోని అభయాంజనేయస్వామి ఆలయం, రెడ్డిపల్లి కృష్ణచంద్రబాబాజీ మఠంలోని ఆంజనేయస్వామి ఆలయం, ఇసకలపాలెం,మద్ది, పొట్నూరు, రేవిడి, పాండ్రంగి, కోరాడ, కృష్ణాపురం గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలు వేడుకగా నిర్వహించారు. రెడ్డిపల్లి, ఇసకలపాలెం, మద్ది గ్రామాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు. రెడ్డిపల్లిలో స్వామివారికి పల్లకీ సేవ చేసిన అనంతరం బైక్ ర్యాలీతో హనుమాన్ శోభాయాత్ర చేపట్టారు.

బీఆర్‌టీఎస్ కారిడార్ పనులను వేగవంతం చేయండి : కమిషనర్

సింహాచలం, జూన్ 1 : జీవీఎంసీ 98వ వార్డులోని గోశాల నుంచి అడివివరం కూడలి మధ్య జరుగుతున్న బీఆర్ టీఎస్ సింహాచలం కారిడార్ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత సమయానికి రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలన్నారు. ముఖ్యంగా అవసరమైన మేరకు కల్వర్టులు, డ్రైన్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా, నిరంతరం రోడ్డును నీటితో తడపాలని ఆదేశించారు. కమిషనర్‌తో పాటు ఎస్ఈ వినయ్‌కుమార్, ఈఈ సుబ్బారావు, డీసీపీ పద్మజ, ఏసీపీ రఘునాథ్, జోన్-8 జెడ్సీ హైమావతి ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



సంస్మరణ సభలో పాల్గొన్న పోలీసు ఉన్నతాధికారులు, రిటైర్డ్ జడ్జిలు

సీఐ కొండ సేవలు ఆదర్శనీయం

సిరిపురం, జూన్ 1 : విశ్రాంత సీఐ కేఎస్ఎన్ కొండ సేవలు ఆదర్శనీయమని ఏసీపీ వివేకనంద అన్నారు. శనివారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో కొండ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పోలీస్ ఉద్యోగి కొండను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎస్పీ శశిభూషణ్ మాట్లాడుతూ నేర విచారణలో కొండ మార్గం అనితర సాధ్యమన్నారు. రిటైర్డ్ జిల్లా జడ్జి డి. లీలావతి మాట్లాడుతూ కుటుంబ, సామాజిక సంబంధాల అభివృద్ధిలో కొండ అనుసరించిన మార్గం అనుసరణీయమైదన్నారు.విశ్రాంత జిల్లా జడ్జి మోర్త రాందాస్ మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిని కాంక్షించి జీవితాచరణలో నిరూపించిన మహోన్నత వ్యక్తి కొండ అన్నారు. ఈ కార్యక్రమంలో బి. భాస్కర్ జోగేష్, బండి సత్యనారాయణ, రామాంజనేయులు, ముత్యాలరావు, సీహెచ్ రాం, జేకేడీ ప్రసాదరావు, రిటైర్డ్ ఎస్పీ సుదర్శన్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు

ఆనందపురం, జూన్ 1 : యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని భీమిలి యోగ చైతన్య సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటరమణ అన్నారు. శనివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ప్రాథమిక శిక్షావర్గ, హోష్‌వర్గ ప్రశిక్షణా సార్వజనికోత్సవం గుడిలోవ విజ్ఞాన విహార్ ఆవాస విద్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో జాతీయ భావాలు పెంపొందించడమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ అడుగులు వేస్తోందన్నారు. మాతృభూమి పట్ల, దేశభక్తిని యువతలో కలిగించడం ద్వారా దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం విద్యార్థులు యోగా, కరాటే, కర్ర సాము తదితర విన్యాసాలను ప్రదర్శించారు.

ఊరేగింపులు, ర్యాలీలపై నిషేధం : ఏడీసీపీ

సింహాచలం, జూన్ 1 : ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలని ఏడీసీపీ బుచ్చిబాబు చెప్పారు. శనివారం ఆయన గోపాలపట్నం శాంతిభద్రతల విభాగం సీఐ సురేష్ అధ్యక్షతన సింహాచలంలో శాంతి భద్రతల పరిరక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయోత్సవ ర్యాలీలపై పూర్తి నిషేధం ఉందని, ఊరేగింపునకు ముందస్తు అనుమతి తప్పనిసరని స్పష్టం చేశారు. ఈనెల 4 నుంచి 6 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో బహిరంగంగా పార్టీలు చేసుకోరాదన్నారు. బాణసంచా కాల్పులను కూడా నిషేధించినట్టు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు సంయమనంతో మెలిగి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఎస్‌ఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, 98వ వార్డు కార్పొరేటర్ నరసింహం, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు



బాలుర విభాగంలో విజేతలుగా నిలిచిన నెల్లూరు జిల్లా జట్టు

భీమునిపట్నం, జూన్ 1 : భీమిలి బీచ్ రోడ్ తిమ్మాపురం వరల్డ్ వన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న తొమ్మిదవ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు శనివారంతో ముగిసాయి. బాలుర విభాగంలో నెల్లూరు, బాలికల విభాగంలో అనంతపురం జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్ ప్రిన్సిపాల్ చైతన్య, వేదాంత సంస్థ వ్యవస్థాపకుడు రాజశేఖర్, ప్రకృతి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లలిత్‌కుమార్, కిషోర్‌కుమార్, పాల్గొన్నారు.

సజావుగా ఓట్ల లెక్కింపు : కలెక్టర్

విశాఖపట్నం, జూన్ 1 : ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ. మల్లికార్జున రిటర్నింగ్, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం రిటర్నింగ్ అధికారుల, పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగున ఏయూలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనున్నందున అందరూ చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ పత్రాలు పొందినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు ముగిసేంత వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు భద్రతలో భాగంగా పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఏసీపీని నియమించామని, పోలీస్ అధికారులు ముందుగానే తమ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించుకోవాలని ఆదేశించారు. పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కోసం 104 టేబుళ్లు, అసెంబ్లీ నియోజకవర్గాలకు 98 టేబుళ్లు సిద్ధం చేసినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన గుర్తింపు కార్డులు పొందిన వారికి మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఏజెంట్లు ఒకసారి కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశిస్తే మళ్లీ కౌంటింగ్ ముగిసేంత వరకు బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండదన్నారు. ఇతరత్రా కారణాల వల్ల బయటకు వెళ్లాల్సి వస్తే తిరిగి లోపలకు వచ్చే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఏజెంట్లకు కూడా ఇదే వర్తిస్తుందన్నారు. సీపీ రవిశంకర్ అయ్యనార్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జేసీ కె మయూర్ అశోక్, రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున



దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, జూన్ 1 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేసవి సెలవులు కావడంతో శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశా ప్రాంతాలతో పాటు నగరంలోని నలుమూలల నుంచి వందలాది మంది వచ్చారు. ఒక దశలో భక్తుల రాకపోకలను పోలీసులు కొండదిగువన నిలువరించి సింహగిరిపై వాహనాల రద్దీని నియంత్రించారు. భక్తుల రద్దీ వల్ల ఉచిత దర్శనం, అతి శ్రీఘ్రదర్శనం క్యూలు కిటకిటలాడాయి. తలనీలాలు సమర్పించే కేశఖండన శాల, గంగధార, ప్రసాద విక్రయాల కేంద్రాల వద్ద కూడా రద్దీ నెలకొంది.

సింహాద్రినాథుడికి వైభవంగా తులసీ దళార్చన



సింహాచలం, జూన్ 1 : వరాహలక్ష్మీ నృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా శనివారం సహస్రనామ తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అర్చకులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ అన్ని నామాలకు తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

భీమిలిలో ఈదురుగాలులతో భారీ వర్షం



ప్రియాగార్డెన్స్‌లో ఇంటిపై కూలిన భారీ వృక్షం

భీమునిపట్నం, జూన్ 1 : పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు పడిన వర్షంతో వాతావరణం చల్లబడింది. కొన్ని రోజులుగా మండిపోతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు ఈ వర్షంతో ఉపశమనం పొందారు.

సింహాచలం/ఆరిలోవ : జీవీఎంసీ 98వ వార్డులో శుక్రవారం రాత్రి 11 తరువాత నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. శనివారం తెల్లవారుజాము వరకు నిర్విరామంగా వర్షం పడింది. వర్షానికి తోడు గాలులు కూడా భారీగా వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గాలుల తీవ్రతకు ప్రియాగార్డెన్స్‌లో పెద్ద చెట్టు సమీపంలోని ఇంటిపై పడడంతో డాబా పిట్టగోడ కూలింది. అలాగే ఆరిలోవలోనూ పలుచోట్ల భారీ వర్షం కురిసింది. గాలులకు చెట్ల కొమ్మలు విద్యుత్ స్తంభాలపై పడడంతో సరఫరాకు అంతరాయం కలిగింది.

ఘనంగా సబ్బం హరి జయంతి

ఆరిలోవ, జూన్ 1 : పాత డెయిరీ ఫారం సమీపంలో ఉన్న ఇందిరానగర్‌లోని ఆనంద్ మార్గ్ అనాథ ఆశ్రమంలో అనకాపల్లి మాజీ ఎంపీ, నగర మాజీ మేయర్ సబ్బం హరి జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పదో వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు అల్పాహారంతో పాటు స్వీట్లు పంచారు. భీమిలి నియోజకవర్గానికి చెందిన సబ్బంహరి యువసేన అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దొంక రామ్‌దీపక్, సింగంపెట్టి రామకృష్ణ, బర్ల చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : మాజీ ఎంపీ సబ్బంహరి జయంతి సందర్భంగా శనివారం స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సబ్బంహరి యువసేన అధ్యక్షుడు కాళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకముందు పలువురు హరి సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పిట్ట వెంకటరావు, ఒకటో వార్డు తెలుగు యువత అధ్యక్షుడు జీరు ప్రతాపరెడ్డి, రెండో వార్డు బీజేపీ కార్యదర్శి ఉప్పలసాయి, మానవ హక్కుల ఫోరం అధ్యక్షుడు కె. శ్రీరామచంద్రమూర్తి, కేజీఎన్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు పురుషోత్తం, వైఎస్ఆర్ సీపీ మహిళా నాయకులు విజయ, ఉమ, కాంగ్రెస్ నాయకులు రమేష్, కుసుమ హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగికి ఆర్థిక సాయం

ఆనందపురం, జూన్ 1 : ఆనందపురం పంచాయతీకి చెందిన జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు విజయనగరం జిల్లా సవరవిల్లి గ్రామానికి చెందిన బాడితబోయిన సాయిగణేష్ (5) కేన్సర్‌తో బాధపడుతుండడంతో శనివారం రూ. 28 వేల ఆర్థిక సహాయం అందజేశారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడ్ని కలిసి అతని తల్లిదండ్రులకు ఈ మొత్తాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే

ఆనందపురం జూన్ 1 : ప్రత్యేక అవసరాల పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు పునాదులు వేయాలని సహిత విద్యా విభాగం సమన్వయకర్త పి. గీత కోరారు. శనివారం ఆమె భవిత కేంద్రం ఉపాధ్యా యులతో కలిసి పలు గ్రామాల్లో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కలమటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

సాగర్‌నగర్/ఎండాడ, జూన్ 1 : రుతు పరిశుభ్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా నగరానికి చెందిన రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎండాడలోని రెడ్యూస్ రియూజ్-రీసైకిల్ సెంటర్ ఆవరణలో మహిళా పారిశుధ్య కార్మికులకు రుతు క్రమం, వ్యక్తిగత పరిశుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఊహ మహంతి రుతు పరిశుభ్రత పాటించడం ఎంత ముఖ్యమో వివరిస్తూ, రుతు క్రమంలో సంభవించే వ్యాధులు, ఇన్ఫెక్షన్లు గురించి తెలియజేశారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం

పద్మనాభం, జూన్ 1 : పద్మనాభంలోని షిరిడీ సాయి, పార్వతమ్మ ఆలయాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు (అన్నమయ్య) ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో కృష్ణాపురం సర్పంచ్ మొకర లక్ష్మీ భవాని, ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి, ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అడివివరం శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

సింహాచలం, జూన్ 1 : అడివివరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో ప్రముఖ కవుల నవలలు, పురాణ ఇతిహాసాలు, సైన్స్, గణితం, టెక్నాలజీ తదితర అనేక పుస్తకాలను ఉంచారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి నరసింహం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తక పఠనం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

కూర్మన్నపాలెం, జూన్ 1 : ఉక్కు ప్రైవేటీకరణ విషయంలో ముఖ్యమంత్రి జగన్ కేంద్ర ప్రభుత్వానికి సహకరించారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న రిలే దీక్షలు శనివారం నాటికి 1206వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడులో సేలం ఉక్కు కర్మాగారం, కర్ణాటకలోని భద్రావతి ఉక్కు కర్మాగారాన్ని కేంద్రం ప్రైవేటీకరణ చేయాలని యత్నిస్తే, ఆయా రాష్ట్రాలు సీఎంలు పోరాడి, ప్రైవేటీకరణలను ఆపి వేశారన్నారు. కానీ మన రాష్ట్రంలో పరిస్థితి వేరుగా ఉందని విమర్శించారు.